PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ


ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 108 | విజయవాడ, శనివారం 19 నవంబర్ 2022 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 19 November 2022 | Rs



భారత మహిళల టేబుల్ టెన్నిస్(టిటి) క్రీడాకారిణి మనికా బత్రా నయా చరిత్ర సృష్టించింది. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో మనికా (4-3) గేమ్‌ల తేడాతో 23వ ర్యాంకర్ చెన్-జు-యు(చైనా)పై సంచలన విజయం సాధించి తొలి భారత క్రీడాకారిణిగా అరుదైన ఘనతను అందుకుంది.

లోపలి పేజీలో..



ప్రైవేటుకు హుషార్!

ఇస్రోపై కేంద్రం కన్ను

- తొలి ప్రయోగం విజయవంతం
- పిపిపిలో కొత్త శకం : కేంద్ర మంత్రి

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీష్ థావన్ స్పేస్ సెంటర్ (షార్)లో శుక్రవారం తొలి ప్రైవేటు రాకెట్ ప్రయోగం విజయవంతమైంది. శుక్రవారం ఉదయం 11.30 గంటలకు రాకెట్‌ను అంతరిక్షంలోకి విజయవంతంగా ప్రవేశపెట్టారు. దీంతో దేశీయ అంతరిక్షరంగంలోని ప్రైవేటు నిర్వాహకులలో హర్షం వ్యక్తమైంది. ప్రయోగం అనంతరం కేంద్ర సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ చేసిన ప్రకటన కూడా దీనికి కారణమైంది. అంతరిక్ష ప్రయోగాల్లో రానున్న రోజుల్లో ప్రైవేటు భాగస్వామ్యానికి పెద్ద పీట వేస్తామని ఆయన ప్రకటించారు. తాజా విజయంతో పిపిపి రంగంలో కొత్త శకం ప్రారంభమైందని అన్నారు. మంత్రి చేసిన ఈ ప్రకటనతో ఇస్రోలో ప్రైవేటు పాత్రపై చర్చ ప్రారంభమైంది. నిజానికి ఇస్రో సామర్థ్యాన్ని పరిగణలోకి తీసుకుంటే శుక్రవారం చేసిన ప్రయోగం చాలా చిన్నది. అయినా కేంద్ర ప్రభుత్వం దీనికి భారీ ప్రాధాన్యతనిచ్చింది. కేంద్ర మంత్రి స్వయంగా హాజరయ్యారు. ఇస్రో ఛైర్మన్‌తో పాటు, కీలక శాస్త్రవేత్తలు, అధికారులు తరలివచ్చారు. ప్రైవేటు రంగానికి సానుకూల సంకేతాలు ఇవ్వడానికే ఇంతమంది హాజరయ్యారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

నాలుగు నిమిషాల్లోనే...

తొలిసారి భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) ప్రైవేటు భాగస్వామితో కలిసి పనిచేస్తుండటంతో మాస్టర్ కంట్రోల్ రూం శుక్రవారం కిటకిటలాడింది. ఇస్రో చరిత్రలోనే మొట్టమొదటిసారి ఇక్కడ ప్రైవేటు వ్యక్తులు కనిపించారు. స్టాపాన్ మోటర్లు లేకపోవడంతో చడీచప్పుడు లేకుండా మిషన్ కంట్రోల్ రూమ్ నుంచి సిగ్నల్ రావడంతోనే మబ్బుల మాటున నింగిలోకి విక్రమ్-ఎస్ రాకెట్ దూసుకుపోయింది. నాలుగు నిమిషాల అనంతరం భూమికి 89.5 కిలోమీటర్ల ఎత్తులోకివెళ్లి 130 కిలోమీటర్ల దూరంలో సముద్రంలో పడిపోయింది. కేవలం నాలుగు నిమిషాల్లో ప్రయోగం పూర్తయింది. ఈ సమయంలో వాతావరణ పరిస్థితులను రాకెట్ అధ్యయనం చేసినట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. ఇది కేవలం ప్రారంభం మాత్రమేనని, అందుకే ఈ ప్రయోగానికి 'న్యూ ప్రారంభ్' అని

మిగతా 5లో

కేంద్ర మంత్రి ఏమన్నారు?

సాంకేతిక రంగంలో వస్తోన్న మార్పులు, అవసరాల కోసం ప్రయివేటుసంస్థలతో కలిసి ఇస్రో రానున్న రోజుల్లో పనిచేయనుందని కేంద్ర, సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ ప్రకటించారు. 1967 నవంబర్ 21 షార్ నుంచి తొలి రాకెట్‌ను ఇస్రో ప్రయోగించిందని, ఇప్పుడు 2022 నవంబర్ 18న షార్ నుంచి ప్రైవేటు రాకెట్ ప్రయోగం చేశామని చెప్పారు. ప్రధాని మోదీ కల ఇదేనని, ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలు కలిసి పనిచేస్తేనే అభివృద్ధి జరుగుతుందని అన్నారు. షార్ నుంచి ప్రైవేటు కంపెనీలు రాకెట్ ప్రయోగానికి అన్ని వసతులూ కల్పిస్తామని, ఉన్న వసతులు ఉపయోగించుకున్నా, కొత్తవి కావాలన్నా కేంద్ర ప్రభుత్వ సమకూర్చుతుందని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో కొత్త శకం ప్రారంభమైందని పేర్కొన్నారు. ప్రైవేటు రంగంలో ఏరో స్పేస్ సంస్థలు 150 వరకు ఉన్నాయన్నారు. ఇక్కడ ప్రయోగం చేయడానికి అన్ని సంస్థలూ దరఖాస్తు చేసుకున్నాయని, అందులో 15 సంస్థలు మాత్రమే ఎంఒయులు కుదుర్చుకున్నాయని తెలిపారు. అటామిక్ ఎనర్జీని కూడా ప్రైవేటీకరించనున్నట్లు చెప్పారు.

ఇప్పుడే ఎందుకు?

పతిష్టాత్మక సంస్థలను ఒకదాని తరువాత ఒకటిగా ప్రైవేటుకు అప్పగిస్తున్న కేంద్ర ప్రభుత్వం భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)పై కూడా కన్నేసిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రయోగాల కోసం నిధుల కోసం కేంద్రంవైపు చూసే స్థితి నుండి ఇటీవలే ఇస్రో స్వయం పోషకంగా ఎదిగిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అనేక వాణిజ్య ప్రయోగాలకు షార్ వేదికగా మారుతోంది. అనేక దేశాలు ఇక్కడి నుండి ఉపగ్రహాలను ప్రయోగించడానికి ఆసక్తి చూపుతున్నాయి. విజయాల రేటు ఎక్కువగా ఉండటం దీనికి కారణం. ఒకప్పుడు ఏడాదికి ఒకటి, రెండు ప్రయోగాలు జరగడమే కష్టంగా ఉన్న పరిస్థితుల నుండి ఇప్పుడు నెలకు రెండు, మూడు రోజులు ప్రయోగాలు చేసే స్థితికి ఇస్రో చేరింది. ఇందుకోసం ప్రతినిత్యం 15 వేల మంది సిబ్బంది, సుమారు నాలుగు వేల మంది శాస్త్రవేత్తలు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. అంతరిక్షంలో కూడా లాభాలు పిండుకునే అవకాశం ఉండటంతో కార్పొరేట్ రంగం కొంత కాలంగా దీనిపై దృష్టి సారించింది. వారికి అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోంది.



ఆనంద్ తెల్తుంబ్డేకు బెయిల్... స్టే

ముంబయి : ఎల్గార్ పరిషద్ కేసులో జైలులో మగ్గుతున్న సామాజిక కార్యకర్త ఆనంద్ తెల్తుంబ్డే (73)కు బెయిల్ మంజూరు చేసిన బాంబే హైకోర్టు , వెంటనే వారం రోజుల పాటు బెయిల్‌ను నిలిపివేస్తూ స్టే ఆదేశాలు జారీ చేసింది. శుక్రవారం ఈ పరిణామం చోటుచేసుకుది. సుప్రీంకోర్టులో బెయిల్ తీర్పును సవాల్ చేయడానికి వీలుగా తమకు కొంత గడువు కావాలంటూ జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) చేసిన విజ్ఞప్తితో జస్టిస్ ఎ.ఎస్.గడ్కరి, జస్టిస్ ఎం.ఎన్.జాదవ్‌లతో కూడిన డివిజన్ బెంచ్ ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. దీంతో బెయిల్ పొందినప్పటికీ వెంటనే బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. సుప్రీంకోర్టు నిర్ణయంపైనే బెయిల్ ఆదేశాల అమలు ఆధారపడి ఉంది. అంతకుముందు లక్ష రూపాయల పూచీకత్తుపై కోర్టు ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. ప్రస్తుతం నవీ ముంబయిలోని తలోజా జైల్లో తెల్తుంబ్డే ఉన్నారు. బెయిల్‌ను ప్రత్యేక కోర్టు తిరస్కరించడంతో గతేడాది హైకోర్టును ఆయన ఆశ్రయించారు. 2017 డిసెంబరు 31న ఎల్గార్ పరిషద్ సమావేశం జరిగిన రోజున తానక్కడ లేనని, ఎలాంటి రెచ్చగొట్టే ప్రసంగాలు చేయలేదని తెల్తుంబ్డే తన బెయిల్ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ కేసులో బెయిల్ పొందిన మూడో నిందితుడు తెల్తుంబ్డే. ఇదే కేసులో వరవరరావుకు మెడికల్ బెయిల్ ఇవ్వగా, సుధా భరద్వాజ్‌కు సాధారణ బెయిల్ ఇచ్చారు.

హాస్టళ్లకు రూ.3364 కోట్లు

- సమీక్షలో సిఎం జగన్
- ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని ఆదేశం



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ గురుకుల పాఠశాలు, సంక్షేమ హాస్టళ్లల్లో నాడు-నేడు పనుల కోసం రూ.3, 364కోట్లు ఖర్చు చేయాలని నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు. తొలి విడతలోనే రూ.1, 500కోట్లు ఖర్చు చేస్తామని అన్నారు. మహిళా, శిశు సంక్షేమశాఖ, సంక్షేమ హాస్టళ్లపై క్యాంపు కార్యాలయంలో సిఎం శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తొలివిడత పనులు వచ్చే జనవరి నుంచి ప్రారంభించి ఏడాదిలోపు పూర్తిచేయాలని ఆదేశించారు. మౌలిక సదుపాయాలతో పాటు కిచెన్ల ఆధునీకరణ వరకూ పనులు నిర్వహించాలన్నారు. హాస్టళ్ల పరిస్థితుల్లో గణనీయంగా మార్పులు తీసుకురావాలని చెప్పారు. పిల్లలకు ఇవ్వాల్సిన వస్తువులను సకాలంలో పూర్తి నాణ్యతతో అందించాలని అన్నారు. పర్యవేక్షణ పద్ధతిని సమూలంగా మార్చాలని ఆదేశించారు. హాస్టళ్లల్లో . ఖాళీగా ఉన్న 759 మంది సంక్షేమ అధికారులు, 80 మంది కేర్ టేకర్ల పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని ఆదేశించారు. గిరిజన సంక్షేమ గురుకులాల్లో 171 మంది హాస్టల్ వెల్ఫేర్ అధికారుల నియామకానికి అనుమతి ఇచ్చారు. పోస్ట్‌మెట్రిక్ హాస్టళ్లలో క్లాస్-4 ఉద్యోగుల నియామకంపైనా దృష్టి పెట్టాలని ఆదేశించారు. ప్రతి హాస్టల్‌ను పరిశీలించి కల్పించాల్సిన సౌకర్యాలు, ఉండాల్సిన సిబ్బంది తదితర అంశాలపై సమాచారాన్ని తెప్పించుకోవాలని ఆదేశించారు. హాస్టళ్ల నిర్వహణలో ఏమైనా సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయడానికి ప్రతి హాస్టల్‌లో ఒక నెంబర్ ఉంచాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో కూడా ఇలాంటి నెంబర్ ఉంచాలని చెప్పారు. అంగన్‌వాడీలకు మూడు నెలల్లోగా ఫ్లేవర్డ్ మిల్క్‌ను సరఫరా చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీల్లో నాడు-నేడు పనులు, అనంతర నిర్వహణపై సమగ్ర కార్యాచరణ ఉండాలని చెప్పారు. మరుగుదొడ్ల నిర్వహణ, పరిశుభ్రతకు పెద్దపీట వేయాలని, ఈ మేరకు సమగ్ర కార్యాచరణ సిద్ధం చేయాలని ఆదేశించారు. . ఈ సమీక్షా సమావేశంలో మహిళ,శిశు సంక్షేమ శాఖమంత్రి కెవి ఉషా శ్రీచరణ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీర్ శర్మ, బిసి సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి జి జయలక్ష్మీ, మహిళా శిశు సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి ముద్దాడ రవిచంద్ర, ఆర్థికశాఖ కార్యదర్శి కెవివి సత్యనారాయణ, ఎపిడిడిసిఎఫ్ ఎండి ఏ బాబు, మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎ సిరి, సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎం జాహ్నవి, మైనార్టీ వెల్ఫేర్ డైరెక్టర్ జిసి కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఇ-పంటే..!

- ఆన్‌లైన్‌లో సాగులు
- ఖాళీగా భూములు
- మెట్ట ప్రాంతాల్లో 30-40 శాతం అంతే
- ఖరీఫ్‌లో కొత్త ట్రెండ్

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ఆన్‌లైన్‌లో పంటలు సాగైనట్లు నమోదవుతుండగా భూములు ఖాళీగా కనిపిస్తున్న వింత ధోరణి ఈ ఖరీఫ్‌లో చాలా చోట్ల సాక్షాత్కరిస్తోంది. వర్షాధారంపై పంటలు సాగయ్యే మెట్ట ప్రాంతాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంది. రాయలసీమ, ప్రకాశం, ఇతర మెట్ట ప్రాంతాల్లో 'డిజిటల్' సాగు బాగా కనిపిస్తోంది. వరి పండే మాగాణి పొలాల్లోనూ అక్కడక్కడ ఆన్‌లైన్‌లోనే నాట్లు నమోదవుతున్నాయి. చేలు ఖాళీగా ఉంటున్నాయి. రైతులు పంటలు వేయకపోయినా ప్రభుత్వ ఒత్తిడితో వ్యవసాయశాఖ సిబ్బంది ఇ-క్రాప్ పోర్టల్‌లో ఎక్కిస్తున్నారు. తద్వారా సేద్యం బాగా జరిగినట్లు చెప్పుకుంటున్నారు. ఖరీఫ్‌లో సాగైందంటున్న విస్తీర్ణంలో దాదాపు 15-20 లక్షల ఎకరాల్లో పంటలు కేవలం ఆన్‌లైన్‌కే పరిమితమని, పొలాలు బీళ్లుగా కనిపిస్తున్నాయని విమర్శలొస్తున్నాయి. రైతు భరోసా, పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, సున్నా వడ్డీ, పంటల కొనుగోళ్లు, పంట రుణాలు.. ప్రతి దానికీ ప్రభుత్వం ఇ-క్రాప్ బుకింగ్‌ను తప్పనిసరి చేసింది. ఖరీఫ్ పంటల నమోదు ప్రక్రియ నిన్న మొన్నటితో ముగించారు. హార్టికల్చర్‌తో కలుపుకొని కోటి పది లక్షల ఎకరాల్లో పంటలు సాగైనట్లు పేర్కొన్నారు. కాగా క్షేత్ర స్థాయి పరిస్థితి ఆ విధంగా లేదు. చాలా చోట్ల ఖాళీ భూములను పంట పొలాలుగా నమోదు చేశారు.

15-20 లక్షల ఎకరాలు!

ఈ ఖరీఫ్‌లో 92.42 లక్షల ఎకరాల్లో పంటల సాగును ప్రభుత్వం లక్ష్యంగా ప్రకటించింది. సాధారణ సాగు విస్తీర్ణం 92.05 లక్షల ఎకరాలు కాగా 86.55 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. నార్మల్‌లో ఐదున్నర లక్షల ఎకరాలు సాగు కాలేదు. ప్రభుత్వ గణాంకాల ప్రకారమే మొక్కజొన్న, పత్తి తప్ప అన్ని పంటలూ తగ్గాయి. ఈ లెక్కలు కూడా తప్పేనని క్షేత్ర స్థాయి పరిస్థితులు తెలుపుతున్నాయి. రాష్ట్రంలో ఖరీఫ్‌లో వర్షాధారంపై పంటలు పండే ఏరియా దాదాపు 50 లక్షల ఎకరాల వరకు ఉంటుంది. దానిలో 30-40

మిగతా 5లో



భారత వృద్ధి 6.3 శాతమే

- ఆర్‌బిఐ అంచనా

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో భారత వృద్ధి రేటు 6.1 నుంచి 6.3 శాతానికి పరిమితం కావొచ్చని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) అంచనా వేసింది. 2022-23లో స్థూలంగా 7 శాతానికి అటూ, ఇటుగా ఉండొచ్చని ఆర్‌బిఐ తన నెలసరి బులిటెన్‌లో పేర్కొంది. ఈ నెల చివరిలో ఎన్ఎస్ఒ జిడిపి గణంకాలను అధికారికంగా విడుదల చేయనుంది. విదేశీ ప్రతికూల పరిణామాలకు తోడు దేశీయంగా హెచ్చు ద్రవ్యోల్బణం జిడిపిపై ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొంది.

యుజిసి ఆదేశాలను ఉపసంహరించుకోవాలి

- సిపిఎం డిమాండ్

న్యూఢిల్లీ : ఈ నెల 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా 'ప్రజాస్వామ్యానికి మాతృక'గా భారతదేశాన్ని పేర్కొంటూ అందుకు సంబంధించిన కొన్ని అంశాలపై విశ్వవిద్యాలయాల్లో ఉపన్యాసాలు నిర్వహించాలని గవర్నర్లను కోరుతూ యుజిసి ఛైర్‌పర్సన్ ఎం.జగదీష్ కుమార్ లేఖ రాయడాన్ని సిపిఎం పొలిట్‌బ్యూరో తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ లేఖను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. 'భారతీయ తత్వంలో ఆదర్శ రాజు', 'ఖాప్ పంచాయతీలు -వాటి ప్రజాస్వామ్య సాంప్రదాయాలు' వంటి అంశాలపై ఉపన్యాసాలు నిర్వహించేలా తమ పరిధిలోని విశ్వవిద్యాలయాలను ప్రోత్సహించాలని ఈ లేఖలో యుజిసి గవర్నర్లను కోరింది. సిపిఎం పొలిట్‌బ్యూరో శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో రాజ్యాంగ నిబంధనలను, పార్లమెంటు చేసిన యుజిసి చట్టంలోని నిబంధనలను యుజిసి లేఖ నేరుగా ఉల్లంఘిస్తోందని, రాజ్యాంగానికి విరుద్ధంగా ఉందని తెలిపింది. నియంతృత్వం లేదా కులీన వర్గాలు లేనందున ప్రాచీన భారతం చాలా విశిష్టమైనదని యుజిసి ఛైర్‌పర్సన్ ఈ లేఖలో పేర్కొనడాన్ని హాస్యాస్పదమని పొలిట్‌బ్యూరో పేర్కొంది. అదే సమయంలో ఆధునిక ప్రజాస్వామ్యానికి ప్రధాన సవాలుగా వున్న కులాల వారీ సామాజిక వర్గ క్రమం, వర్ణాశ్రమం వంటి వాస్తవికతలను పూర్తిగా విస్మరించి అటువంటి వ్యాఖ్యలు చేయడం తగదని తెలిపింది. ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలతో ఉన్నతవిద్యపై సంప్రదింపులు జరపాల్సిన రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామిక కర్తవ్యాన్ని విస్మరించి, ఎన్నికకాని, ఆర్‌ఎస్‌ఎస్-బిజెపి నియమించిన గవర్నర్లకు నేరుగా లేఖ రాసిన విషయాన్ని పొలిట్‌బ్యూరో ప్రస్తావించింది. రాజ్యాంగం పునాదులను దెబ్బతీస్తూనే శాస్త్రీయ దృక్పథం, హేతుబద్ధతలను నాశనం చేయడానికి విద్యను ఒక సాధనంగా ఉపయోగించాలన్న జాతీయ విద్యా విధానం యొక్క వాస్తవ లక్ష్యాన్ని ఈ ప్రక్రియ బహిర్గతం చేసిందని పేర్కొంది. తక్షణం ఈ లేఖను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. దీని సాధన కోసం చేతులు కలపాల్సింగా ప్రజాస్వామిక సంస్థలు, వ్యక్తులకు పొలిట్‌బ్యూరో విజ్ఞప్తి చేసింది.



ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ప్రభాకరరెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర నూతన కార్యదర్శిగా కె ప్రభాకరరెడ్డి ఎన్నికయ్యారు. శుక్రవారం జరిగిన సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు ఎన్నిక జరిగినట్లు అధ్యక్షులు వి కృష్ణయ్య తెలిపారు. ఇటీవల వరకూ కార్యదర్శిగా ఉన్న పి జమలయ్య అర్థిక అవకతవకలకు పాల్పడిన నేపథ్యంలో ఆయనను సంఘం నుండి బహిష్కరించిన సంగతి తెలిసిందే. శుక్రవారం జరిగిన రాష్ట్ర కమిటీ సమావేశంలో నూతన కార్యదర్శిని ఎన్నుకున్నారు.

నేడు, రేపు ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ భేటీ

లోపలి పేజీలో..



రేషన్ షాపుల్లో గోధుమలు

- కిలో రూ.6.10 చొప్పున పంపిణీ
- పైలట్ ప్రాజెక్టుగా శ్రీకాకుళం ఎంపిక

తల్లిదండ్రులతో విద్యార్థుల వలసబాట

- 7 వేలమంది బడికి దూరం
- వీరి కోసం 27 సీజనల్ హాస్టళ్ల ఏర్పాటు

లోపలి పేజీలో..

వీడని ప్రతిష్టంభన


- నష్టపరిహార నిధి ఏర్పాటుపై కుదరని అంగీకారం
- కాప్ 27 సదస్సు మరో రోజు పొడిగింపు

షర్మ్ ఎల్ షేక్ (ఈజిప్ట్) : గ్లోబల్ వార్మింగ్ ప్రభావంతో విపత్తులను ఎదుర్కొంటున్న వర్ధమాన దేశాల కోసం వాతావరణ నష్టపరిహార నిధిని ఏర్పాటు చేయడంపై ప్రతిష్టంభన నెలకొనడంతో కాప్ 27 సదస్సును శనివారం వరకూ పొడిగించారు. ముందుగా అనుకున్న షెడ్యూల్ ప్రకారం శుక్రవారంతో సదస్సు ముగియాల్సి ఉంది. దాదాపు 200 దేశాలకు చెందిన ప్రతినిధులు రెండు వారాల పాటు ఇక్కడ సమావేశమై, వాతావరణ మార్పులపై చేపట్టాల్సిన కార్యాచరణను రూపొందించే లక్ష్యంతో చర్చలు జరిపారు. ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు ఇప్పటికే ఈ గ్లోబల్ వార్మింగ్ ప్రభావాలను అనుభవిస్తున్నాయి. విపరీతంగా వర్షాలు, వరదలు, వడగాలులు, కరువు కాటకాలు సంభవిస్తూ ప్రజలను తీవ్ర ఇబ్బందుల్లో పడేస్తున్నాయి. సంపన్న దేశాలు వెలువరించే కాలుష్య కారకాల వల్ల పేద, వర్ధమాన దేశాలు ప్రధానంగా ఇబ్బందులు పడుతున్నాయి. దీంతో, సంపన్న దేశాలు నష్టపరిహారం ఇవ్వాలన్న అంశంపై ప్రధానంగా చర్చ జరిగింది. నష్టపరిహార నిధి ఏర్పాటుపై ఉమ్మడి ప్రాతిపదిక కోసం సంపన్న, వర్ధమాన దేశాలు ఇంకా మల్లగుల్లాలు పడుతూనే వున్నాయి. వీటితోపాటు పలు కీలకమైన అంశాలపైనా ఒక అభిప్రాయానికి రావాల్సి వుంది. సమయం మించిపోతున్నందున మనం మరింత వేగంగా వ్యవహరించాల్సి వుందని ఈజిప్ట్ విదేశాంగ మంత్రి సామేహ్ షౌక్రీ ప్రతినిధులతో అన్నారు. 1.5 డిగ్రీల సెల్సియస్‌కు సగటు ఉష్ణోగ్రతలను పరిమితం చేసేందుకు కాలుష్య ఉద్గారాల్లో కోతపై ఒప్పందాన్ని కుదుర్చుకోవాల్సి వుంది. నిధి ఏర్పాటుపై కూడా అంగీకారానికి రావాల్సి వుంది. పెరుగుతున్న గ్లోబల్ వార్మింగ్‌తో సముద్ర మట్టాలు పెరిగే ప్రమాదాన్ని పలు చిన్న దీవుల దేశాలు ఎదుర్కొంటున్నాయి. అత్యంత ప్రమాదాన్ని, హానిని ఎదుర్కొనే దేశాల కోసం నిధిని ఏర్పాటు

మిగతా 5లో

ప్రజలకు తప్ప ఎవరికీ భయపడను

- కర్నూలులో ముగిసిన చంద్రబాబు పర్యటన



కర్నూలులో టిడిపి జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న చంద్రబాబు నాయుడు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

అసలైన రాయలసీమ ద్రోహి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి అని రాష్ట్ర ప్రతిపక్షనేత చంద్రబాబునాయుడు విమర్శించారు. జిల్లాలో మూడో రోజు పర్యటనలో భాగంగా కర్నూలుకు ఆయన వచ్చారు. చంద్రబాబకు పర్యటనకు వైసిపి శ్రేణులు ఎక్కడికక్కడే అడ్డంకులు సృష్టించారు. ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశాయి. దీంతో, టిడిపి శ్రేణులు, వైసిపి శ్రేణుల పోటాపోటీ నినాదాలతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. తొలుత మౌర్య ఇన్ హోటల్ వద్ద టిడిపి పార్లమెంట్ నియోజకవర్గాల వారీ సమీక్ష నిర్వహిస్తుండగా కొందరు న్యాయవాదులు అక్కడికి చేరుకున్నారు. న్యాయ రాజధాని కర్నూలుకు చంద్రబాబు మద్దతు ఇవ్వాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. దీనికి ప్రతిగా రాష్ట్ర ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా టిడిపి నాయకులు నినాదాలు చేశారు. పోలీసులు జోక్యంతో పరిస్థితి సద్దుమణిగింది. మధ్యాహ్నం టిడిపి జిల్లా కార్యాలయం వద్ద ఎన్‌టిఆర్ విగ్రహావిష్కరించేందుకు చంద్రబాబు వెళ్తుండగా మార్గమధ్యంలో బుధవారపేట వద్ద వైసిపి నాయకులు మారువేషాల్లో వచ్చి ఆయన కాన్వాయ్‌ను అడ్డగించారు. రోడ్డుకడ్డంగా కూర్చున్నారు. పోలీసులు వారిని చెదరగొట్టారు. జిల్లా టిడిపి కార్యాలయం ముందు వైసిపి నాయకులు ప్లకార్డులతో నిరసనకు దిగారు. చంద్రబాబు గో బ్యాక్, రాయలసీమ ద్రోహి చంద్రబాబు అంటూ నినాదాలు చేశారు. దీనికి పోటీగా టిడిపి నాయకులు నినాదాలు చేస్తూ ముందుకెళ్లడంతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు టిడిపి నాయకులను వెనక్కి పంపారు. అనంతరం టిడిపి కార్యాలయానికి చంద్రబాబు చేరుకొని ఎన్‌టిఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. నగర శివారులోని టిడ్కో గహాలను, కబ్జాకు గురైన బి.తాండ్రపాడు చెరువును పరిశీలించారు. చంద్రబాబు మాట్లాడుతూ వైసిపి వారిని కట్టడి చేయడం చేతకాకపోతే పోలీసులు యూనిఫాం తీసేయాలని, తాను చూసుకుంటానని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓటమి భయంతోనే ముఖ్యమంత్రి జగన్ ప్రాంతాల మధ్య చిచ్చు పెడుతున్నారని విమర్శించారు. రాయలసీమలో ముఠా నాయకులను అణచివేసిన పార్టీ టిడిపి అని అన్నారు. ఆడబిడ్డల పట్ల ఇష్టానుసారం ప్రవర్తిస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ధర్మాన్ని కాపాడేందుకు అందరూ ముందుకు రావాలని కోరారు. వైసిపి మాదిరి చిల్లర రాజకీయాలు చేయబోయమన్నారు. తాను ప్రజలకు తప్ప ఎవరికీ భయపడబోనని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందామని పేర్కొన్నారు. టిడ్కో గృహాల సముదాయం వద్ద కూడా చంద్రబాబుకు వ్యతిరేకంగా ప్లకార్డులతో వైసిపి శ్రేణులు నిరసన తెలిపాయి. మూడు రోజుల పర్యటన ముగించుకుని చంద్రబాబు హైదరాబాద్‌కు విమానంలో బయలుదేరి వెళ్లారు. ఈ పర్యటనలో ఆయన వెంట కేంద్ర మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, కర్నూలు, నంద్యాల జిల్లాల టిడిపి అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, గౌరు వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.

భూసర్వేలో లోపాలను సవరించండి

- వడ్డే శోభనాద్రీశ్వరరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో జరుగుతున్న భూసర్వేలో వున్న లోపాలతో రైతులు నష్టపోతున్నారని, భూ సర్వేలో లోపాలను సవరించేందుకు చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు కోరారు. శుక్రవారం నాడు మంగళగిరిలోని చీఫ్ కమీషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లి సిసిఎల్‌ఎ కమీషనర్ జి సాయిప్రసాద్‌కు వడ్డేతో సహా రైతు సంఘాల నాయకులు యెర్నేని నాగేంద్రనాథ్, కెవివి ప్రసాద్, యల్లమందారావు, వడ్డే వెంకట అంకినీడు ప్రసాద్, యెర్నేని సీతాదేవి తదితరులు వినతి పత్రం అందజేశారు. భూ సర్వేలో వున్న లోపాలను, సమస్యలను ఆయనకు వివరించారు. చెరువు నిర్మాణంలో భూమి కలిగిన రైతుల హక్కులకు భంగం కలగకుండా సర్వే చేయాలని కోరారు. భూసర్వే అనంతరం ఫైనల్ నోటిఫికేషన్ వచ్చాక ఏమైనా ఫిర్యాదులు వస్తే వాటిపై కమిటీ ఏర్పాటు చేసి పరిష్కరిస్తామని సిసిఎల్‌ఎ కమిషనర్ జి సాయిప్రసాద్ హామీ ఇచ్చారు.

మున్సిపల్ ఉపాధ్యాయులకు డిడిఒ పవర్స్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మున్సిపల్ ఉపాధ్యాయుల జీతాలు, సెలవుల మంజూరు, ఇంక్రిమెంట్లు ఇతర అంశాలను రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ పరిధిలోకి తీసుకొచ్చింది. అదేవిధంగా మున్సిపల్ ఉపాధ్యాయుల వేతనాలు తీసి, చెల్లించే అధికారాల (డిడిఒ)ను మున్సిపల్ ఉపాధ్యాయులకు కల్పించింది. ఇందుకు సంబంధించిన జివో 180ను పాఠశాల విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి రాజశేఖర్ శుక్రవారం విడుదల చేశారు. ఇప్పటి వరకు మున్సిపల్ ఉపాధ్యాయులకు జీతాలు ఇచ్చే అధికారం పురపాలక కమిషనర్లకు ఉండేది. మున్సిపల్ విద్య పర్యవేక్షణను రాష్ట్రప్రభుత్వం విద్యాశాఖ పరిధిలోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే ఉపాధ్యాయుల వేతనాలు, ఇంక్రిమెంట్లు, సెలవులు మంజూరు వంటి అంశాలతో కూడిన ఉత్తర్వులను విడుదల చేసింది. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల వేతనాలను ఎంఇఒ, ఉన్నత పాఠశాలల జీతాలను గెజిటేడ్ ప్రధానోపాధ్యాయులు జమ చేస్తారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ,
ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ,
అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి,
గుంటూరు జిల్లా - 522 501కు కానీ
editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

అడ్‌హాక్ ప్రమోషన్ ఉత్తర్వులివ్వండి : ఎమ్మెల్సీ సాబ్జీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయుల అడ్‌హాక్ ప్రమోషన్ ఉత్తర్వులను వెంటనే ఇవ్వాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ డిమాండ్ చేశారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మువ్వా రామలింగంను కలిసి శుక్రవారం వినతిపత్రం అందించారు.

ఉపాధ్యాయుల బదిలీలు నిర్వహించడటంలో పాఠశాల విద్యాశాఖ వైఫల్యం చెందిందనే విషయం స్పష్టంగా కనిపిస్తుందని విమర్శించారు. కనీసం ప్రమోషన్లకు విల్లింగ్ ఇచ్చిన ఉపాధ్యాయులకు అడ్‌హాక్ ప్రమోషన్లు ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్జిటిల ప్రమోషన్ల వల్ల ఏర్పడిన ఖాళీలలో 1998 డిఎస్సి ద్వారా ఎంపికైన అభ్యర్థులను నియమించాలని కోరారు. బదిలీల నిర్వహణపై స్పష్టమైన ప్రకటన విడుదల చేయాలని కోరారు. ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బందికి పదవీ విరమణ వయస్సు పెంపుదలకు సంబంధించిన ఫైల్‌ను గవర్నర్ ఆమోదం కోసం సత్వరమే పంపించాలని సిఎంఒ కార్యాలయంలో మరో వినతిపత్రం అందజేశారు.

డిఎంఇ నోటిఫికేషన్‌పై హైకోర్టు స్టే

ప్రజాశక్తి, అమరావతి

గవర్నమెంట్ మెడికల్ కాలేజీల్లో చదివిన పీజీ విద్యార్థులకు సీనియర్ రెసిడెంట్స్‌గా అవకాశం ఇవ్వడాన్ని హైకోర్టు అభ్యంతరం చెప్పింది. ఈ మేరకు వైద్య విద్య డైరెక్టర్ (డిఎంఇ) జారీ చేసిన నోటిఫికేషన్‌ను ఆక్షేపించింది. నోటిఫికేషన్ అమలును నిలిపివేస్తూ స్టే ఉత్తర్వులు జారీ చేసింది. విచారణను డిసెంబర్ 7కి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. ఈలోగా ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని జస్టిస్ జి.రామకష్ణప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వైద్య విద్యాశాఖ డైరెక్టర్ ఈ నెల 13న వెలువరించిన నోటిఫికేషన్ పలువురు పీజీ విద్యార్థులు హైకోర్టులో సవాల్ చేశారు. నోటిఫికేషన్ వివక్షతో ఉందన్నారు. ఈ వాదనను ప్రభుత్వం వ్యతిరేకించింది. అయితే స్టే ఇచ్చిన హైకోర్టు విచారణను డిసెంబర్ 7కి వాయిదా వేసింది.

గ్రామసభలో కాదు.. మాకు చెప్పండి

- ఆర్-5 జోన్‌పై రైతులకు సిఆర్‌డిఎ నోటీసులు
- తీర్మానం చేసినా మరలా విచారించడంపై అభ్యంతరాలు
- ప్రభుత్వ ఆదేశాల మేరకు చేస్తున్నామన్న సిఆర్‌డిఎ అధికారులు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని మాస్టర్ ప్లానులో ఆర్5 జోన్ ఏర్పాటు చేస్తూ సిఆర్‌డిఎ తీసుకున్న నిర్ణయంపై అభ్యంతరాలు వ్యక్తం చేసిన రైతులను సిఆర్‌డిఎ మరలా విచారణకు పిలుస్తోంది. దీనిపై రైతులు ఆగ్రహంగా ఉన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు తాము గ్రామసభలకు హాజరై తమ అభిప్రాయాలు తెలిపామని, మరలా విచారణ ఏమిటని ప్రశ్నిస్తున్నారు. రాజధాని అమరావతి పరిధిలోని మందడం, ఐనవోలు, కృష్ణాయపాలెం, నిడమర్రు, కురగల్లు పరిధిలో గతంలో ఉన్న జోన్లను విడగొట్టి కొత్తగా 900.97 ఎకరాల విస్తీర్ణంలో ఆర్-5 జోన్ ఏర్పాటు చేశారు. నూతన జోన్ ఏర్పాటు కోసం రిజర్వు జోన్, రీజనల్ సెంటర్ జోన్, పొల్యూటింగ్ ఇండస్ట్రీస్ జోన్, టౌన్‌సెంటర్‌జోన్, ఎడ్యుకేషన్, నైబర్‌హుడ్ సెంటర్, బిజినెస్‌పార్కు జోన్లను విడగొట్టారు. ఎఫర్డబుల్ హౌసింగ్‌జోన్ కొత్తగా ఏర్పాటు చేస్తూ ఈ ఏడాది అక్టోబర్ 28వ తేదీన 1410 నెంబరు గెజిట్ విడుదల చేసింది. దీనిపై ఈ నెల 11వ తేదీన అభ్యంతరాలను స్వీకరిస్తున్నట్లు సిఆర్‌డిఎ అధికారులు ప్రకటించారు. అంతకుముందే మాస్టర్‌ప్లానును విడగొట్టడం సరికాదని పేర్కొంటూ రైతులు హైకోర్టులో పిటీషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన కోర్టు గ్రామసభలు పెట్టి అభ్యంతరాలు తీసుకోవాలని ఆదేశించింది. ఈ మేరకు సిఆర్‌డిఎ అధికారులు 11వ తేదీన గ్రామసభలు ఏర్పాటు చేశారు. సభలకు హాజరైన రైతులు తాము నూతన జోన్‌ను ఏకగ్రీవంగా వ్యతిరేకిస్తున్నామని తెలపడంతో అన్ని గ్రామాల్లోనూ ఆ మేరకు అధికారులు తీర్మానం రాశారు. అలా అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ సంతకాలు చేసిన వారందరికీ సిఆర్‌డిఎ అధికారులు మరలా నోటీసులు పంపించారు. స్వయంగా వచ్చి సిఆర్‌డిఎ అధికారుల నిర్వహించే విచారణకు హాజరు కావాలని, ఎందుకు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారో తెలపాలని నోటీసులు జారీచేశారు. అన్ని గ్రామాలకు ఈ నోటీసులు పోస్టు ద్వారా పంపించారు. దీనిపై రైతులు సిఆర్‌డిఎ కార్యాలయానికి చేరుకుని తమ అభిప్రాయం చెబుతున్నారు. అయితే గ్రామసభ నిర్వహించిన తరువాత మరలా ఈ విచారణ జరపడం వెనుక మతలబు ఉందని, అయినా న్యాయవాది చెప్పారనే ఉద్దేశంతో వెళుతున్నామని పలువురు రైతులు తెలిపారు.

శుక్రవారం సుమారు 600 మంది రైతులు సిఆర్‌డిఎ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సిఆర్‌డిఎలో మార్పుపై మీ అభిప్రాయం ఏమిటి ? మేమేమీ చేయలేదని మీరు భావిస్తున్నారు ? రోడ్లు వేయలేదా ? అభివృద్ధి పనులు చేయలేదా ? మరెందుకు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని ప్రశ్నించారు. దీనిపై రైతులు చెప్పిన విషయాన్ని నోట్ చేసుకుంటున్నారు. మీరు లేకపోతే మేమే లేమని అధికారులు చెప్పగా అటువంటప్పుడు మీరే మా గ్రామాలకు వచ్చి విచారించొచ్చుకదా ఇక్కడదాకా ఎందుకు పిలుస్తున్నారు అని రైతులు ప్రశ్నించారు.

దీనికి అధికారులు స్పందిస్తూ కమిషనర్ ఆదేశాలు ఇక్కడే జరపాలని ఉందని, అందువల్లే ఇక్కడ జరుపుతున్నామని వివరించారు. దీనిపై రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు గ్రామసభ జరిపిన తరువాత మరలా ఇక్కడకు పిలవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అప్పుడు గ్రామసభకు విలువ ఇచ్చినట్లా కాదా అని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఒకసారి హైకోర్టును ఆశ్రయించిన తరువాత వచ్చిన ఆదేశాల మేరకు గ్రామసభకు హాజరయ్యామని, ఇదే అంశంపై మరో విచారణ జరపడం, తమను ఖచ్చితంగా హాజరు కావాలని కోరడం వెనుక రైతులను ఇబ్బంది పెట్టాలనే ఆలోచన ఉండొచ్చని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జెఎసి నాయకులు కూడా వెళ్లి విచారణకు హాజరవ్వాలని ఖచ్చితంగా చెప్పారని, అందువల్లే వెళుతున్నామనీ రైతులు తెలిపారు.

అమరావతిలో 'ఆకలి కేకలు'

- పారిశుధ్య కార్మికుల నిరాహార దీక్ష
- పొమ్మనకుండ ప్రభుత్వం పొగపెడుతోంది : సిహెచ్ బాబూరావు



దీక్షలను ప్రారంభించి ప్రసంగిస్తున్న బాబూరావు

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)

పెండింగ్ జీతాల చెల్లింపు, ఇతర సమస్యలు పరిష్కారించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ గుంటూరు జిల్లా తుళ్లూరు సిఆర్‌డిఎ కార్యాలయం వద్ద రాజధాని అమరావతి పారిశుధ్య, హౌస్ కీపింగ్ కార్మికులు ఆకలి కేకల పేరుతో శుక్రవారం రిలే దీక్షలు చేపట్టారు. రాజధాని పారిశుధ్య కార్మిక సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన ఈ దీక్షలను సిఐటియు రాష్ట్ర నాయకులు సిహెచ్ బాబూరావు ప్రారంభించి మాట్లాడారు. జీతాలు అందక పారిశుధ్య, హౌస్ కీపింగ్ కార్మికులకు ఆకలితో అలమిటిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం లక్షల రూపాయలతో రోజుకో సలహాదారును నియమించుకుంటోందని, ఇంకో వైపు రోడ్లు ఊడ్చే, చెత్త తొలగించే పారిశుధ్య కార్మికులకు మాత్రం సక్రమంగా జీతాలు చెల్లించడం లేదని విమర్శించారు. 2023 జనవరి నుండి పారిశుధ్య కార్మికుల జీతభత్యాలపై ఇతర విషయలలో తమకు సంబంధం లేదని సిఆర్‌డిఎ అధికారులు చేతులెత్తేస్తున్నారని తెలిపారు. రాజధానిలో నిర్మాణాలు జరగక, భవన నిర్మాణ రంగం కుదేలైందని అన్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో పేదలు గ్రామాల్లో, సచివాలయం, హైకోర్టులో పారిశుధ్య, హౌస్ కీపింగ్ కార్మికులుగా పనిచేస్తున్నారని తెలిపారు. నాలుగు నెలలు గడుస్తున్నా వారికి జీతాలు ఇవ్వక పోతే ఎలా బతుకుతారని ప్రశ్నించారు. రాజధాని కార్మికులు 90 శాతం మంది పేదలని, వారిలో 85 శాతం మంది మహిళలు ఉన్నారని అన్నారు. వీరికి ఉద్యోగాలు ఉన్నాయంటూ అమరావతి సామాజిక జీవన భృతి రూ 2,500లు సైతం ప్రభుత్వం ఇవ్వడంలేదని తెలిపారు. మున్సిపల్ కార్మికులకు చెల్లిస్తోన్న విధంగా వీరికీ రూ.21వేలు వేతనం ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఔట్ సోర్సింగ్ కార్పొరేషన్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు స్పందించాలని, లేకుంటే అన్ని వర్గాల ప్రజల మద్దతులో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నిరాహార దీక్షలో సంఘం గౌరవ అధ్యక్షులు ఎం రవి, నాయకులు వేణు, సుశీల, ఎం భాగ్యరాజు, వెంకటేశ్వరరావు, ఆంజనేయులు పాల్గొన్నారు.



భూసేకరణపై రైతుల అభ్యంతరం

- నేషనల్ హైవే 167ఎ కు భూములు ఇవ్వడానికి విముఖత

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పల్నాడు జిల్లాలో నరసరావుపేట - చిలకలూరిపేట నియోజకవర్గ పరిధిలో నుంచి నేషనల్ హైవే 167 ఏ (నకిరేకల్ నుంచి చీరాల ఓడరేవు) వరకు వెళ్ళే రహదారి విస్తరణ కొరకు ప్రభుత్వం చేపట్టిన భూసేకరణపై పలువురు రైతులు అభ్యంతరం వ్యక్తం చేశారు. భూ సేకరణ నోటీఫికేషన్‌ను వ్యతిరేకిస్తూ నరసరావుపేట, జొన్నలగడ్డ, కేశనపల్లి, రావిపాడు, గుంతగార్లపాడుకు చెందిన సుమారు 123 రైతులు శుక్రవారం పల్నాడు జిల్లా కలెక్టర్‌ను కలిశారు. భూ సేకరణకు వ్యతిరేకంగా రైతులు అభ్యంతరాలను తెలిపారు. వారి నుంచి వినతిపత్రాలను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, నరసరావుపేట రెవెన్యూ డివిజన్ అధికారి శేషిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నేడు, రేపు ఎఐకెఎస్ జాతీయ కౌన్సిల్ భేటీ

- వ్యవసాయరంగ సంక్షోభం, మద్దతు ధరల చట్టంపై రాష్ట్ర సెమినార్
- గుంటూరు శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఏర్పాట్లు


సమావేశాలు జయప్రదం చేయాలని పెదకాకాని ప్రచారంలో మాట్లాడుతున్న రైతు సంఘం గుంటూరు జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) జాతీయ కౌన్సిల్ సమావేశాలు శని, ఆదివారాల్లో గుంటూరులో జరగనున్నాయి. ఈ సందర్భంగా వ్యవసాయరంగ సంక్షోభం, మద్దతు ధరల చట్టం, ప్రభుత్వ విధానాలపై రాష్ట్రస్థాయి సెమినార్ స్థానిక శ్రీవెంకటేశ్వర విజ్ఞానమందిరంలో శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు జరగనుంది. ఈ సెమినార్‌కు ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య అధ్యక్షత వహిస్తారు. ఈ సభలో ఎఐకెఎస్ అధ్యక్షులు అశోక్ ధావలే, ప్రధాన కార్యదర్శి హనన్ మొల్లా, సహాయ కార్యదర్శి విజ్జూకృష్ణన్, కోశాధికారి కృష్ణప్రసాద్ తదితరులు ప్రసంగిస్తారు. కేరళ, బెంగాల్, త్రిపుర, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, రాజస్థాన్‌తోసహా 29 రాష్ట్రాల నుంచి నాయకులు పాల్గొంటారు. శనివారం కౌన్సిల్ ప్రారంభ సభ, సెమినార్ బ్రాడీపేటలోని సిపిఎం కార్యాలయంలో జరగనుంది. ఆదివారం జాతీయ కౌన్సిల్ రెండవ రోజు సమావేశం పార్టీ కార్యాలయంలో కొనసాగనుంది. వ్యవసాయరంగం రోజురోజుకు సంక్షోభంలో కూరుకుపోతున్న నేపథ్యంలో రైతులకు తగిన భరోసా ఇచ్చేందుకు కనీస మద్దతు ధరల (ఎంఎస్‌పి) చట్ట సాధన కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు భవిష్యత్తులో చేయాల్సిన పోరాటాలపై చర్చించనున్నారు. బిజెపి ప్రభుత్వం రూపొందించిన నల్ల చట్టాలకు వ్యతిరేకంగా 13 నెలలపాటు ఢిల్లీ కేంద్రంగా సాగిన రైతాంగ ఉద్యమం ప్రధాని మోడీ మెడలు వంచి రైతు వ్యతిరేక నల్ల చట్టాలను రద్దు చేయించడంలో ఎఐకెఎస్ ప్రధాన భూమిక పోషించింది. ఇదే రీతిలో సెప్టెంబరు నాలుగున ఢిల్లీ సదస్సు చేసిన తీర్మానం ప్రకారం కనీస మద్దతు ధరల (ఎంఎస్‌పి) చట్ట సాధనకు పది లక్షల మంది రైతులతో త్వరలో పార్లమెంటు ముట్టడికి ఎఐకెఎస్ పిలుపునిచ్చింది. పార్లమెంటు ముట్టడిపై జాతీయ కౌన్సిల్‌లో చర్చించనున్నారు. డిసెంబరు 13 నుంచి 16 వరకు కేరళలోని త్రిచూర్‌లో జరగనున్న ఆలిండియా మహాసభ జయప్రదం కోసం ఈ కౌన్సిల్‌లో చర్చిస్తామని ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య పేర్కొన్నారు. దేశంలో 540 రైతు సంఘాలు రెండో దశ పోరాటానికి సన్నద్ధం అవుతున్నాయి. దేశ వ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేయాల్సి ఉంది. వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లు బిగించే బూటకపు విద్యుత్ చట్టాన్ని ఉపసంహరించాలని, రుణ విముక్తి చట్టం చేయాలని, 50 ఏళ్లు దాటిన రైతులకు నెలకు రూ.5 వేలు పింఛన్ ఇవ్వాలని, ఎరువులు, పురుగు మందుల ధరలు తగ్గించాలని, ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకం అమలును కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టరాదని, ఫైర్లను చిన్నాభిన్నం చేస్తున్న వైరస్‌ల నిరోధానికి పటిష్ట చర్యలు తీసుకోవాలని, సుబాబుల్ రైతులకు ప్రభుత్వం గిట్టుబాటు ధర చెల్లించాలని, పాల రైతులకు ప్రభుత్వం ఇస్తానన్న లీటరు రూ.4 చెల్లించాలని, పెరిగిన దాణా ధరలకు ప్రభుత్వం సబ్సిడీ భరించాలని, మూడు రాజధానుల పేరుతో రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందని తదితర అంశాలపై కౌన్సిల్‌లో చర్చించనున్నారు.

కోర్టు ధిక్కారణ కేసులో హైకోర్టుకు హాజరైన ఐఎఎస్‌లు

ప్రజాశక్తి, అమరావతి

పెన్షన్ ప్రయోజనాల వ్యవహారంలో సర్వీసు లెక్కింపు విషయంపై దాఖలైన కోర్టు ధిక్కార కేసులో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ఎస్ రావత్, పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్, గత కమిషనర్, రిటైర్డు అధికారి చినవీరభద్రుడు శుక్రవారం హైకోర్టుకు హాజరయ్యారు. తదుపరి విచారణకు వారి హాజరీని న్యాయమూర్తులు జస్టిస్ ఏవీ శేషసాయి, జస్టిస్ ఆర్.రఘునందన్‌రావులతో కూడిన డివిజన్ బెంచ్ మినహాయింపు ఇచ్చింది.

హైకోర్టు ఆదేశాలు అమలు కావడం లేదంటూ కోర్టు ధిక్కరణ కేసులు ఎక్కువగా దాఖలు కావడంపై హైకోర్టు అసంతృప్తిని వ్యక్తం చేసింది. ఈ ఏడాదిలోనే 4300 కోర్టుధిక్కార కేసులు నమోదయ్యాయని ఆందోళన వ్యక్తం చేసింది. హైకోర్టు ఉత్తర్వుల అమలుకు, కోర్టుధిక్కార కేసుల సంఖ్య తగ్గంపునకు చర్యలు తీసుకుంటామని ఏజీ ఎస్.శ్రీరామ్ హామీ ఇచ్చారు.

1985-91 మధ్య ప్రభుత్వ పాఠశాలల్లో పార్ట్‌టైం టీచర్లుగా పనిచేసిన పలువురికి అనుకూలంగా ఏపీ పరిపాలనా ట్రిబ్యునల్ ఉత్తర్వులు ఇచ్చింది. ఆ ఉత్తర్వులు అమలు కాకపోవడంతో హైకోర్టు, సుప్రీంకోర్టులకు వెళ్లారు. దీనిపై కోర్టు ధిక్కార కేసు వేశారు. ఈ కేసు తదుపరి విచారణ వచ్చే ఏడాది ఫిబ్రవరి 17కి వాయిదా పడింది.

ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో...బిజెపి నేత సంతోష్‌కు నోటీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశవ్యాప్తంగా రాజకీయవర్గాల్లో దుమారం రేపిన టిఆర్ఎస్ ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారంలో బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి బిఎల్ సంతోష్‌కు సిట్ శుక్రవారం నోటీసులు జారీ చేసింది. ఎమ్మెల్యేల బేరసారాలకు సంబంధించిన ఆడియో టేపుల్లో నిందితులు పలుమార్లు సంతోష్ పేరునే ప్రస్తావించారు. దీంతో ఆయనను విచారిస్తే కీలక సమాచారం వచ్చే అవకాశం ఉందని భావించిన సిట్ సంతోష్‌కు సిఆర్‌పిసి 41ఎ కింద నోటీసులు జారీ చేసింది. కమాండ్ కంట్రోల్‌లోని సిట్ కార్యాలయంలో ఈ నెల 21న ఉదయం 10.30 గంటలకు విచారణకు హాజరు కావాలని సిట్ చీఫ్ సివి ఆనంద్ నోటీసుల్లో పేర్కొన్నారు. ఒకవేళ విచారణకు హాజరు కాకపోతే అరెస్టు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కేసులో కరీంనగర్‌కు చెందిన న్యాయవాది, బిజెపి నేత బంధువు శ్రీనివాస్‌కు కూడా నోటీసులు జారీ చేశారు. ఆయనను కూడా 21నే విచారణకు హాజరుకానున్నారు. ఈ కేసుతో సంబంధంలేని వారికి నోటీసులిచ్చి వేధిస్తు న్నారని బిజెపి హైకోర్టును ఆశ్రయించింది. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి శుక్రవారం పిటిషన్ దాఖలు చేశారు. బి.ఎల్ సంతోష్, న్యాయవాది శ్రీనివాస్‌కు నోటీసులు ఇచ్చిన విషయాన్ని పిటిషన్‌లో ప్రస్తావించారు. వీటిపై స్టే ఇవ్వాలని న్యాయస్థానాన్ని కోరారు.

విద్యుత్ రంగాన్ని కుదేలు చేసిన జగన్ : టిడిపి విమర్శ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి జగన్ నేతృత్వంలోని వైసిపి ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని కుదేలు చేసిందని టిడిపి అధికార ప్రతినిధి జివి రెడ్డి విమర్శించారు. టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు పెంచనని, విద్యుత్ రంగాన్ని మెరుగుపరుస్తానని చెప్పి మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం యూనిట్ రూ.20కు కొనేలా చేశారని తప్పుబట్టారు. ఇటు విద్యుత్ వినియోగదారులను, అటు ఉద్యోగులను మోసం చేశారన్నారు. కృష్ణపట్నం విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ప్రైవేట్‌కు కట్టబెట్టనున్నారని వాపోయారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించడమంటే రైతుల మెడకు ఉరితాళ్లు వేయడమేనని పేర్కొన్నారు.

'ఉక్కు' పరిరక్షణకు ప్రజా పోరాటాలు

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ



ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

ప్రజా పోరాటాలతో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, జివిఎంసి 72వ వార్డు సిపిఐ కార్పొరేటర్ ఎజె.స్టాలిన్ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 645వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 32 మంది ప్రాణత్యాగాలతో ఏర్పడిన స్టీల్‌ప్లాంట్‌ను ప్రజా మద్దతుతో కాపాడుకుంటామని తెలిపారు. సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, పోరాట కమిటీ కో-కన్వీనర్ గంధం వెంకటరావు, నాయకులు వైటి.దాస్, గణపతి రెడ్డి, వరసాల శ్రీనివాస రావు, డివి.రమణా రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు కర్మాగారాన్ని నూటికి నూరు శాతం అమ్మాలనే ప్రతిపాదన చేసినప్పటి నుంచి దీక్షలు కొనసాగుతున్నా మోడీ సర్కారు పట్టించుకోకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు జె.రామకృష్ణ, మసేనురావు, నెల్లి అప్పలరాజు, చిత్రాడ సన్యాసిరావు, గుమ్మడి నరేంద్ర, సిపిఎం, సిపిఐ నేతలు పాల్గొన్నారు.

చాగంటికి గురజాడ పురస్కారం తగదు

- సాహితీ స్రవంతి

ప్రజాశక్తి- అమరావతి బ్యూరో

మహాకవి గురజాడ అప్పారావు భావాలకు విరుద్ధంగా ప్రవచనాలు వల్లించే చాగంటి కోటేశ్వరరావుకు గురజాడ పేరిట పురస్కారం ఇవ్వడం ఎంతమాత్రం తగదని సాహితీ స్రవంతి పేర్కొంది. ఈ మేరకు సాహితీ స్రవంతి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు తెలకపల్లి రవి, అధ్యక్ష కార్యదర్శులు కెంగార మోహన్, కె సత్యరంజన్ ఒక ప్రకటన విడుదల చేశారు. "గురజాడ స్వస్థలమైన విజయనగరంలో గురజాడ సాంస్కృతిక సమాఖ్య పేరిట వివిధ సంఘాలు కలసి ఆయన వారసత్వాన్ని ముందుకు తీసుకుపోయే ప్రయత్నం చేస్తూ వస్తున్నాయి. ఇందులో భాగంగా ప్రముఖ రచయితలు, కళాకారులు, ఇతర విధాల సేవలందించిన వారిని ఎంపిక చేసి ఏటా ఒక పురస్కారం అందిస్తున్నాయి. కాలక్రమంలో సమాఖ్య బాధ్యులు ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడమే గాక గురజాడ భావాలకు, ప్రబోధాలకు పూర్తి విరుద్ధంగా పురస్కారం అందజేస్తున్నారు. గతంలో గరికపాటి నరసింహారావును ఎంపిక చేసిన ఈ కమిటీ.. ఈసారి చాగంటి కోటేశ్వరరావుకు ఈనెల 30న ఇవ్వనున్నట్టు ప్రకటించింది. మూఢాచారాలను, ఛాందస పోకడలను నిరసించి దేశభక్తి, సంఘ సంసంస్కరణ, హేతువాద వైజ్ఞానిక స్ఫూర్తినందించిన మహాకవి గురజాడ వారసత్వాన్ని కించపర్చే వైఖరి ఇది. గరికపాటి, చాగంటి వంటివారు నిత్యం గురజాడ భావాలకు వ్యతిరేకంగా ప్రవచనాలు చేయడం అందరికీ తెలుసు. ఎవరికైనా వారిపై భక్తి వుంటే మరో విధంగా చూపించుకోవచ్చు గానీ తెలుగుజాతి వైతాళికుడైన గురజాడ స్మృతిని అగౌరవపరచడం తగని పని." అని పేర్కొన్నారు. సమాఖ్య పెద్దలు తమ నిర్ణయం మార్చుకోవాలని డిమాండు చేశారు. ఈ పురస్కారం అనుచిత ప్రదానాన్ని నిరసిస్తూ రాష్ట్రమంతటా సభలు, కార్యక్రమాలు జరపాలని సాహితీ మిత్రులకు విజ్ఞప్తి చేశారు. ఈనాటి పరిస్థితుల్లో ఈ కార్యక్రమ ప్రాధాన్యత గుర్తించి ప్రగతిశీల ప్రజాస్వామ్య సాహిత్య సంస్థలు, సంఘాలు ఈ నిరసనలో భాగస్వాములు కావాలని కోరారు.

నేరుగా ముఖ్యమంత్రితో...

- ఇక వేగంగా 'స్పందన' !

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ప్రజా సమస్యల పరిష్కారానికి అమలు చేస్తున్న స్పందనను మరింత వేగంగా ముందుకు తీసుకువెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. తమతమ సమస్యలపై నేరుగా ముఖ్యమంత్రితోనే మాట్లాడే విధంగా ఆలోచిస్తున్న అధికారులు అందుకు అనుగుణంగా విధానంలో మార్పులు చేయనున్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం, ప్రణాళిక శాఖలు కలిసి రూపకల్పన చేస్తున్నారు. ఈ మేరకు అన్ని శాఖలకు మార్గదర్శకాలు కూడా జారీ అయ్యాయి. సమస్యలను గుర్తించేందుకు ఇప్పటివరకు ఉన్న విధానంలో మార్పులు చేస్తూ అంశాల వారీగా రేషనలైజేషన్ చేయాలని నిర్ణయించారు. సమస్యలను గుర్తించిన తరువాత వాటికి ప్రత్యేక రికార్డులు సిద్ధం చేయడం, వాటి పరిష్కారానికి వేగంగా చర్యలు తీసుకోవడంపై దృష్టి సారిస్తున్నారు. గత కొద్ది కాలంగా స్పందనకు వస్తున్న ఫిర్యాదులు గణనీయంగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజా సమస్యల పరిష్కారానికి 'స్పందన' వ్యవస్థను మరింత మెరుగుపర్చి, వేగవంతం చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

మాజీ మంత్రి నారాయణను విచారించిన సిఐడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి నారాయణను ఎపి సిఐడి పోలీసులు శుక్రవారం విచారించారు. హైకోర్టు ఆదేశాల మేరకు విజయవాడ నుంచి హైదరాబాద్ వచ్చిన స్పెషల్ టీం హైదరాబాద్, కూకట్‌పల్లి లోధా అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న నారాయణకు సిఆర్‌పిసి 160 కింద నోటీసులు అందజేశారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం వరకు విచారించిన సిఐడి నారాయణ స్టేట్‌మెంట్‌ను రికార్డు చేశారు. అమరావతి ఇన్నర్ రింగ్ రోడ్ మాస్టర్ ప్లాన్ మార్పుల్లో అవకతవకలకు సంబంధించి తాము సేకరించిన సమాచారాన్ని ఆయన ముందుంచి సిఐడి ప్రశ్నించినట్లు తెలిసింది. హెరిటేజ్‌తో పాటు టిడిపి నాయకులతో దగ్గర సంబంధాలున్న కంపెనీలకు లాభం చేకూరేలా మాస్టర్ ప్లాన్ మార్చారన్న అభియోగాలపై విచారించారు. ప్రభుత్వ నిబంధనల మేరకే నిర్ణయం తీసుకున్నామని, ఎక్కడా ఉల్లంఘనలు జరగలేదని నారాయణ సిఐడి అధికారులకు సమాధానం ఇచ్చినట్లు తెలిసింది.

రేషన్ షాపుల్లో గోధుమలు

- కిలో రూ.6.10 చొప్పున పంపిణీ
- పైలట్ ప్రాజెక్టుగా శ్రీకాకుళం ఎంపిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

చౌక ధరల దుకాణాల ద్వారా గోధుమలు పంపిణీ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన (పిఎంజికెఎవై) కింద జాతీయ ఆహార భద్రతా చట్టం పరిధిలో ఉన్న కార్డుదారులకు వీటిని అందించనుంది. ఇందుకోసం ప్రయోగాత్మకంగా రాష్ట్రంలో శ్రీకాకుళం జిల్లాను ఎంపిక చేసింది. లబ్ధిదారుల వినియోగం ఆధారంగా రాష్ట్ర వ్యాప్తంగా దీన్ని అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ అధికారులు ఇప్పటికే జిల్లా పౌర సరఫరాల సంస్థ అధికారులకు ఒక సర్క్యులర్ జారీ చేశారు. ఒక్కొక్కరికి కిలో రూ.6.10 చొప్పున మూడు కిలోలు పంపిణీ చేయనున్నారు. అక్టోబరు నుంచి డిసెంబరు వరకు అందించనున్నారు. అక్టోబర్ నెలకు ఇవ్వాల్సిన గోదుమలను నవంబర్ చివరిలో పంపిణీ చేయనున్నారు. జిల్లాకు అవసరమైన గోధుమలను నెలకు 1839.97 మెట్రిక్ టన్నుల చొప్పున మూడు నెలల కాలానికి 5,519.91 మెట్రిక్ టన్నులు కేటాయించారు. భారత ఆహార సంస్థ (ఎఫ్‌సిఐ) ద్వారా వీటిని తీసుకోవాలని రాష్ట్ర ఉన్నతాధికారులు సూచించారు.

అధికారుల్లో సందిగ్ధత

గోధుమల పంపిణీపై అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ అధికారులు జారీ చేసిన సర్క్యులర్‌లో గోధుమలు, గోధుమపిండి అని ఒకచోట పేర్కొన్నారు. గోధుమలు పంపిణీ చేయాలా లేక వాటితో పాటు పిండిని కూడా ప్యాకెట్ల రూపంలో అందించాలా అనే సందిగ్ధత నెలకొంది. ఈ అంశంపై స్పష్టతనివ్వాలని ఉన్నతాధికారులకు లేఖ రాశారు.

కేంద్రం నేరుగా పంపిణీ ఇదే తొలిసారి

చౌక ధరల దుకాణాల ద్వారా బియ్యం, కందిపప్పు, పంచదారతోపాటు గతంలో గోధుమలు, గోధుమపిండి ఇచ్చేవారు. కేంద్రం అందించిన సబ్సిడీతోపాటు రాష్ట్ర ప్రభుత్వం మిగిలిన భారం భరించి పేదలకు అందించేవి. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వమే నేరుగా ఎన్ఎఫ్ఎస్ఎ కార్డుదారులకు తొలిసారిగా గోధుమలు అందిస్తోందని అధికారులు చెప్తున్నారు.

గతంలో పది రాష్ట్రాలకు కోత

గరీబ్ కల్యాణ్ యోజన కింద పలు రాష్ట్రాలకు పంపిణీ చేయాల్సిన గోధుమలపై ఈ ఏడాది మేలో కేంద్రం కోత పెట్టింది. ప్రయివేట్ వర్తకుల వద్ద ఎక్కువ ధరకు కొనాల్సి వస్తుందని, సకాలంలో గోధుమల సేకరణ సక్రమంగా చేయని కారణంగా పది రాష్ట్రాలకు గోధుమలు ఇవ్వలేదు. వాటిలో బీహార్, ఝార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, గుజరాత్, మధ్యప్రదేశ్, తమిళనాడు ఉన్నాయి. ప్రస్తుతం గోధుమ నిల్వలు ఉండడంతో ఆయా రాష్ట్రాలకు పునరుద్ధరించడంతోపాటు ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

డ్రోన్ వినియోగంలో శిక్షణకు ఒప్పందం



పరస్పర ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఉపకులపతి తదితరులు

ప్రజాశక్తి - తాడికొండ (గుంటూరు జిల్లా)

ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధన, బోధన సిబ్బందికి, విద్యార్థులకు డ్రోన్ టెక్నాలజీలో శిక్షణ ఇవ్వడానికి ప్యాసెంజర్ డ్రోన్ రెస్క్యూ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో ఒప్పందం కుదిరినట్లు వర్సిటీ ఉపకులపతి డాక్టర్ ఆదాల విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. గుంటూరు జిల్లా లాంలోని ఆచార్య ఎన్‌జిరంగా విశ్వవిద్యాలయంలో శుక్రవారం జరిగిన పాలకమండలి సమావేశంలో సభ్యుల సమక్షంలో అవగాహన ఒప్పందం కుదిరిందని చెప్పారు. శిక్షణలో ప్రిసిషన్ ఫార్మింగ్, ఏరో మెప్పింగ్, ప్లాంటేషన్ వినియోగించి ప్రచారం చేయడం, పురుగులు, తెగుళ్లను గుర్తించడం, అంగ్రు పుష్పక్ సిరీస్ వ్యవసాయ డ్రోన్‌లకు సహాయ పడడం తదితర అంశాలపై ఒప్పందం కుదిరిందని ఆ సంస్థ ప్రతినిధి అనిల్ చాన్డీలియా పేర్కొన్నారు. కార్యక్రమంలో డ్రోన్ పరిశోధన విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎ సాంబయ్య, డాక్టర్ జి.రామారావు, డాక్టర్ ఎల్ ప్రశాంతి పాల్గొన్నారు.

రోడ్డెక్కిన ధాన్యం రైతులు

- డీజిల్, పురుగుమందు డబ్బాలతో ఆందోళన
- మంత్రి కారుమూరి జోక్యంతో ఆందోళన విరమణ



దువ్వ జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న రైతులు

ప్రజాశక్తి - తణుకురూరల్

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పశ్చిమగోదావరి జిల్లా రైతులు శుక్రవారం రోడ్డెక్కారు. తణుకు మండలం దువ్వ గ్రామంలో జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. సుమారు రెండు గంటలపాటు వాహన రాకపోకలు స్తంభించాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడారు. సుమారు రెండు లక్షల గోనె సంచులు అవసరముండగా కేవలం 30 వేలు మాత్రమే అందుబాటులో ఉంచారని తెలిపారు. రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదుకావడం లేదన్నారు. దీంతో గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం 11 గంటల వరకు కేవలం రెండు లారీల్లో మాత్రమే లోడు చేశారని తెలిపారు. రాత్రీ, పగలు ఆర్‌బికెల వద్ద పడిగాపులు పడలేమంటూ రైతులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సాంకేతిక సమస్య లు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జాతీయ రహదారిపై బైఠా యించి ఆందోళనకు దిగారు. ప్రజాప్రతినిధులు, అధికారులు అక్కడికి చేరుకుని రైతులతో మాట్లాడారు. 24 గంటల నుంచి ఇబ్బందులు పడుతున్నా తమను ఎవ్వరూ పట్టించుకోలేదని, మాకు ఆత్మహత్యలే శరణ్యమంటూ ఐదు లీటర్ల డీజిల్‌ను రైతులు తమపై చల్లుకున్నారు. మరో ఇద్దరు పురుగుమందు డబ్బాలతో తిరగడంతో ఒక్కసారిగా ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పౌరసరఫరాల శాఖ మంత్రి డాక్టర్ కారు మూరి వెంకటనాగేశ్వరరావు సివిల్ సప్లయిస్ డిఎం శివశంకర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. రైతుల వివరాలను ఆఫ్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. దీంతో రైతు లు ఆందోళన విరమించారు. టిడిపి మాజీ ఎమ్మెల్యేలు రైతు భరోసా కేంద్రం వద్దకు వచ్చి అధికారులతో మాట్లాడారు.

102 కిలోల గంజాయి స్వాధీనం

- నలుగురు అరెస్టు

ప్రజాశక్తి - కంచికచర్ల

ఒడిశా నుండి ముంబయికి గంజాయి రవాణా చేస్తున్న రెండు కార్లను ఎన్‌టిఆర్ జిల్లా పోలీసులు పట్టుకున్నారు. 102 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రెండు కార్లను సీజ్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం... శుక్రవారం తెల్లవారుజామున నందిగామ రూరల్ సిఐ ఐవి నాగేంద్ర కుమార్, కంచికచర్ల ఎస్ఐ పిపిఎస్ సుబ్రహ్మణ్యం తమ సిబ్బందితో కలిసి కంచికచర్ల మండలం కీసర టోల్ ప్లాజా వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. విజయవాడ నుండి హైదరాబాద్‌వైపు వెళ్తున్న రెండు కార్లను తనిఖీ చేయగా వాటిలో గంజాయి ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించారు. గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించి విచారించారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కొలనుకొండ గ్రామానికి చెందిన అవుతు శివ శంకర్ రెడ్డి, తెన్నేరు నరసింహారావు, ఏలూరుకు చెందిన గేదెలు సాయికిరణ్, కమలేష్ కుమార్ శర్మ ఒడిశా నుండి ముంబయికి రెండు కార్లలో ప్రత్యేకంగా అమర్చిన అరలలో గంజాయి ప్యాకెట్లను పెట్టి తరలిస్తున్నట్లు గుర్తించారు.

జగన్‌తోనే మహిళా అభ్యుదయం

- మంత్రి ఉషశ్రీ చరణ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అబద్ధాలు తప్ప మరేం మాట్లాడటం లేదని రాష్ట్ర స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి ఉష శ్రీచరణ్ పేర్కొన్నారు. రాష్ట్రంలో మహిళాభ్యుదయం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యమన్నారు. శుక్రవారం నాడు తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. డ్వాక్రా గ్రూపులు 'తనవల్లే' వచ్చాయంటూ చంద్రబాబు అబద్ధాలు చెప్తున్నారని విమర్శించారు. 2014-19 మధ్యలో డ్వాక్రా మహిళలకు రూ.14 వేల కోట్లు మోసం చేసిన ఘనత ఆయనదేనని ఆమె ఆరోపించారు. నాలుగు విడతల్లో రూ.25 వేల కోట్ల రుణాలను మాఫీ చేస్తామని మాటిచ్చిన జగన్ ఇప్పటికి రూ.12,750 కోట్లు ఇచ్చినట్లు తెలిపారు. మహిళలకు యాభై శాతం పైగా పదవులు కూడా ఇచ్చి రాజకీయంగానూ జగన్ ప్రోత్సహిస్తున్నారని తెలిపారు.

తల్లిదండ్రులతో విద్యార్థుల వలసబాట

ఏడు వేలమంది బడికి దూరం ● వీరి కోసం 27 సీజనల్ హాస్టళ్ల ఏర్పాటు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ప్రతి ఏడాది మాదిరి ఈ ఏడాది కూడా కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతం నుంచి ఉపాధి కూలీలు వలస బాటపట్టారు. వారితో పాటు పిల్లలు కూడా వలస వెళ్లారు. దాదాపుగా ఏడువేల మంది పిల్లలు బడికి దూరంగా ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు ఇటీవల గుర్తించారు. వలస వెళ్లే విద్యార్థులు బడికి దూరంగా ఉండకుండా వారి కోసం ప్రత్యేకంగా సీజనల్ హాస్టల్స్ ఏర్పాటు చేశారు. ఆదోని డివిజన్ పరిధిలోని 17 మండలాల నుంచి గుంటూరు, విజయవాడ, హైదరాబాదు, చెన్నై బెంగళూరు నగరాలకు పనుల కోసం కూలీలు వలస వెళ్లారు. వారితో పాటు పిల్లలను కూడా తీసుకెళ్లారు. విద్యార్థుల హాజరు నమోదు ఆధారంగా ఇటీవల విద్యాశాఖ అధికారులు సర్వే చేపట్టారు. నవంబర్‌లో 7,577 మంది విద్యార్థులు పాఠశాలలకు రావడం లేదని గుర్తించారు. ఇందులో ఆరు నుంచి 14 ఏళ్ల వయస్సు కలిగిన బాలబాలికలు ఉన్నారు. వీరందరూ విద్యకు దూరం కాకుండా ప్రత్యేకంగా సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో సీజనల్ హాస్టల్స్‌ను జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు శుక్రవారం ప్రారంభించారు. ఆదోని డివిజన్‌లో దాదాపు 27 హాస్టల్స్‌ను ప్రారంభించారు. ఇందులో ఉదయం, రాత్రి రెండు పూటలా భోజనంతోపాటు వసతి సౌకర్యం కల్పిస్తారు. మధ్యాహ్నం పాఠశాలలో మధ్యాహ్నం భోజనం పథకం కింద ఆహారాన్ని అందిస్తారు. సీజనల్ హాస్టళ్ల నిర్వహణ నిమిత్తం ఒక కేర్ టేకర్, ఒక విద్యా వలంటీర్, ఒక వంట మనిషి, ఒక వాచ్‌మెన్ ఉంటారు. ఈ హాస్టల్స్ నిర్వహణ బాధ్యతలను డ్వాక్రా గ్రూపులకు అప్పగించారు. ఈ విద్యా సంవత్సరం ముగిసే వరకు సీజనల్ హాస్టల్స్‌ను నడిపేందుకు సమగ్ర శిక్ష అభియాన్ చర్యలు చేపట్టింది.

మరో 41సీజనల్ హాస్టల్స్

కె. వేణుగోపాల్ అడిషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ సమగ్ర శిక్ష అభియాన్ కర్నూలు జిల్లాలో వలస వెళ్లే విద్యార్థుల కోసం ప్రత్యేకంగా సీజనల్ హాస్టల్స్ ప్రారంభించాం. మొదట విడత కింద 27 హాస్టల్స్ మంజూరు చేయగా.. మరో విడతలో 41 హాస్టల్స్ ఏర్పాటు చేయనున్నాం. ఏ ఒక్క విద్యార్థీ బడికి దూరం కాకుడదనే ప్రభుత్వ లక్ష్యం. ఈ విద్యా సంవత్సరం వరకు సీజనల్ హాస్టల్స్‌ను నిర్వహిస్తాం.


కార్లు, ఫ్రిజ్‌లు కొనొద్దు



- మాంద్యం ముంచుకొస్తోంది ● నగదు దాచుకోండి
- అమెజాన్ అధిపతి జెఫ్ బెజోస్ సూచన

వాషింగ్టన్ : ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మాంద్యం ముంచుకొస్తోందని అమెజాన్ వ్యవ స్థాపకులు జెఫ్ బెజోస్ హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ప్రజలకు ఆయన కొన్ని సూచనలు చేశారు. ఈ సమయంలో కార్లు, రిఫ్రిజిరేటర్లు, టివిలను కొనుగోలు చేయ కుండా ఉండటమే మంచిద న్నారు. కొనుగోళ్ల విషయంలో ఆచితూచి వ్యవహరించాలని బెజోస్ సిఎన్‌ఎన్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు. ఈ సీజన్‌లో అనవసర ఖర్చులకు దూరంగా ఉండాలని, డబ్బు దాచుకోవాలని సూచిం చారు. ఆర్థిక పరిస్థితులు బాగో లేనందున కొత్త కార్లు, రిఫ్రిజిరేటర్ల వంటి వాటి జోలికి పోకపోవడమే మంచిదన్నారు. "మీరు ఒక పెద్ద టివి కొనుగోలు చేయాలనే ఆలోచనలో ఉంటే.. ఆ యోచనను విరమించుకోండి. మీ నగదును మీ దగ్గరే ఉంచు కోండి. టివి, ఫ్రిజ్, కారు అది ఏదైనా కావొచ్చు.. రిస్క్‌కు కాస్త దూరంగా ఉండండి. చిన్న వ్యాపారస్తులు తమ వ్యాపారాన్ని విస్తరించడానికి పెట్టుబడులు పెట్టే యోచన ఉంటే కాస్త ఆలోచించడం మేలు. కొనుగోళ్లకు బదులు నగదు నిల్వలు పెంచుకోండి. కష్టకాలానికి ఎదుర్కోవడానికి కూడా సిద్ధంగా ఉందాం". అని బెజోస్ సూచించారు. ప్రస్తుతం అమెజాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా ఉన్న బెజోస్ గతేడాది సిఇఒగా తప్పుకుని ఆ బాధ్యతలను అండీ జస్సీకి అప్పగించారు. బెజోస్ దాదాపు 10 లక్షల కోట్ల సంపద కలిగి ఉన్నారు. తన సంపదలో పెద్ద మొత్తాన్ని పర్యావరణ పరిరక్షణ కోసం ఇవ్వనున్నట్లు ప్రకటించారు. ఆర్థిక మాంద్యం భయాల నేపథ్యంలో ట్విట్టర్, మేటా బాటలోనే ఇటీవల అమెజాన్ కూడా 10వేల మంది ఉద్యోగులను తొలగించాలని నిర్ణయించినట్లు రిపోర్టులు వచ్చాయి. దీనిని ఆ కంపెనీ వర్గాలు ఖండించక పోయినప్పటికీ వచ్చే ఏడాది నుంచి కోతలు ప్రారంభమవుతాయని సంకేతాలు ఇచ్చింది.

భీమిలి బీచ్‌లో ఇద్దరు విద్యార్థుల గల్లంతు



ప్రజాశక్తి - భీమునిపట్నం (విశాఖపట్నం)

విశాఖ భీమిలి బీచ్‌లో శుక్రవారం విషాదం చోటుచేసుకుంది. తీరం చెంత కాసేపు సరదాగా గడుపుదామని వచ్చిన ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు సముద్రంలో గల్లంతయ్యారు. పోలీసుల కథనం ప్రకారం.. సంగివలస అనిల్ నీరుకొండ ఇంజినీరింగ్ కళాశాలలో ఇసిఇ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఏడుగురు విద్యార్థులు ఉదయం 11.30 గంటలకు భీమిలి బీచ్‌కు వచ్చారు. లైట్‌హౌస్ ఎదురుగా సాగర కన్య బొమ్మ వద్ద పెందుర్తికి చెంది న వేమల సూర్య వంశీ, మధుర వాడ కారు షెడ్డు ప్రాంతానికి చెందిన కుడితి సాయితో పాటు మరో విద్యార్థి మణికంఠ ఈత కోసం సముద్రం లోకి దిగారు. వీరిలో సూర్యవంశీ, సాయి కెరటాల తాకిడికి గల్లంతయ్యారు. మణికంఠ ఈదుకుంటూ అతి కష్టం మీద ఒడ్డుకు చేరుకున్నాడు. గల్లంతైన వారి కోసం నేవీ హెలీకాప్టర్, మూడు స్పీడ్ బోట్లు రంగంలోకి దిగాయి. గజ ఈతగాళ్ల సాయంతో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. భీమిలి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైసిపి అవినీతిపై ఛార్జిషీట్లు : జివిఎల్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైసిపి ప్రభుత్వ హయాంలో అవినీతి విచ్చలవిడిగా జరుగుతోందని, ఆ పార్టీ వైఫల్యాలు, అవినీతిపై నియోజకవర్గాల వారీగా ఛార్జిషీట్లు వేసి, ప్రజలను చైతన్య పరిచేందుకు త్వరలో కార్యాచరణను సిద్ధం చేస్తున్నామని బిజెపి రాజ్యసభ సభ్యులు జివిఎల్ నరసింహారావు అన్నారు. విజయవాడలోని రాష్ట్ర పార్టీ కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర పార్టీ అధ్యక్షులు సోము వీర్రాజుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి నల్లడబ్బు విమానాల్లో తరలిపోతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు.

సంపాదకీయం

సాఫ్ట్ వర్రీ !

సోషల్ మీడియా, ఇ-కామర్స్, ఇ-ఎడ్ తదితర ఇంటర్నెట్ ఆధారిత సంస్థల్లో ఇటీవల చోటుచేసుకుంటున్న వరుస పరిణామాలు సాఫ్ట్‌వేర్ రంగంలో భయాందోళనలు కలిగిస్తున్నాయి. వేలాది కొలువులు ఊడుతున్నాయి. పని గంటలు పెరిగిపోతున్నాయి. అదనపు పని గంటలు పని చేస్తారా? ఇంటికి వెళ్లిపోతారా? అంటూ టెక్ కంపెనీల అధినేతలు ఉద్యోగులకు హుంకుం జారీ చేసే స్థాయికి పరిస్థితులు దిగజారిపోయాయి. అందాల ఐటి కలలు ఛిద్రమై బతుకులు కన్నీటి తెరలుగా మిగిలిపోతున్నాయి. ఐటి అనుబంధ రంగాలు, విమానయానం, ఆతిథ్య రంగం, స్థిరాస్తి తదితర రంగాల్లోనూ ఇదే దుస్థితి నెలకొంది. ప్రపంచ ఆర్థిక మాంద్యం పరిస్థితులను సాకుగా చేసుకొని టెక్ కంపెనీలన్నీ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా పాలకులు చేష్టలుడిగి వాటికే సాగిలపడుతుండటం దారుణం.

కోవిడ్ మహా విపత్తు కంటే ముందు నుంచే ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు సుస్తీ చేసిన సంగతి విదితమే. ఉపాధి అవకాశాలను మెరుగుపర్చి ప్రజల కొనుగోలు శక్తి పెంచే ప్రణాళికలు రచించకుండా వేతనాలు తగ్గించడం, సిబ్బందిని కుదించుకోవడం వంటి 'పొదుపు చర్యల'కు పెట్టుబడిదారి వ్యవస్థ పరిమితం కావడంతో ఆర్థిక సంక్షోభం మరింతగా కోరలు చాచింది. కోవిడ్ తర్వాత పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లైంది. విపత్తును ఎదుర్కొనే పేరిట ప్రభుత్వాలు ప్రకటించిన 'ఉద్దీపన' ప్యాకేజీల్లో కార్పొరేట్‌లకే అత్యధిక లబ్ధి చేకూరిన మాట వాస్తవం. కోట్లాది ప్రజల సంపదను అప్పనంగా కాజేసిన ఆ సంస్థలకు ప్రజల సంపద దోపిడిపై దాహం ఇప్పటికీ తీరడం లేదు. లాక్‌డౌన్ సమయంలో 'వర్క్ ఫ్రం హోం' వంటి శ్రమ దోపిడి ఎత్తుగడలు పన్నిన కంపెనీలు.. ఇప్పుడు పని గంటలు పెంచుతూ ఆ మేరకు సిబ్బందిని కుదించుకునేందుకు పావులు కదుపుతున్నాయి. టెస్లా అధినేత ఎలన్ మస్క్ మొదలుపెట్టిన ఈ దురాగతాన్ని మెటా (ఫేస్‌బుక్, వాట్స్‌యాప్, ఇన్‌స్టాగ్రామ్ గ్రూపు సంస్థ), గూగుల్, అమెజాన్, స్విగ్గీ, ఇతర సంస్థలు కొనసాగిస్తున్నాయి. ఆన్‌లైన్ స్టార్టప్‌గా పెను సంచలనం సృష్టించిన బైజూస్ సంస్థ ఇప్పుడు మసకబారుతోంది. వేలాది మంది ఉన్నత ఉద్యోగులను ఇంటికి పంపేసింది. బైజూస్‌తో పాటు ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్, నోయిడా కేంద్రాలుగా నడుస్తున్న ఓలా, బ్లింక్‌ఇట్, అన్‌అకాడమీ, వైట్‌హ్యాట్ జూనియర్ సైబర్ టెక్, ఎడ్యూటెక్, గిగ్ సంస్థలూ ఈ ఒక్క ఏడాదిలోనే 16000 మందిని తొలగించాయి. అక్టోబరు నెలలోనే 5000 మంది ఉద్యోగులను సాగనంపారు. తాజాగా జెట్ ఎయిర్‌వేస్ సంస్థ 60 శాతం మంది ఉద్యోగులను బలవంతపు వేతన రహిత సెలవులకు పంపుతోంది. అంటే ఉద్యోగం పోదు కాని జీతం ఇవ్వరు.

అమెరికా, బ్రిటన్ వంటి పెట్టుబడిదారీ దేశాలన్నీ ఆర్థిక సంక్షోభ సుడిగుండంలో చిక్కుకోవడంతో త్రైమాసిక ఫలితాల్లో వృద్ధి గ్రాఫులన్నీ తిరోగమనం పడుతుండటంతోనే ఐటి కంపెనీలు 'పొదుపు చర్యల'కు తెగిస్తున్నాయన్నది ఓ విశ్లేషణ. ఇది ప్రారంభం మాత్రమేనని అసలైన ముసళ్ల పండుగ ముందున్నదని హెచ్చరిస్తున్నారు. జారిపోతున్న ఆర్థిక వృద్ధి రేటు అంచనాలు ఆ హెచ్చరికలకు బలం చేకూరుస్తున్నాయి. సెప్టెంబరు త్రైమాసికంలో భారత వృద్ధి రేటు 6.3 శాతానికి మించలేదని రిజర్వుబ్యాంకు పేర్కొంది. ఒకేసారి వేలాది మంది కొలువులు కోల్పోతే ఆ ప్రభావం మిగిలిన రంగాలకూ శరవేగంగా విస్తరిస్తుంది. నిరుద్యోగుల మార్కెట్ అమాంతం పెరిగిపోయి శ్రమదోపిడికి మార్గం సుగమం అవుతుంది. ఎక్కువ గంటలు పని చేస్తారా? నిష్క్రమిస్తారా? అంటూ టెస్లా, ట్విట్టర్ అధినేత ఎలన్ మస్క్ చేసిన బరితెగింపు హెచ్చరికలే దీనికి నిదర్శనం. ఐటి రంగ కొలువుల పరిస్థితి అసంఘటిత రంగ కార్మికులను తలపిస్తుండటం దయనీయం. ఖర్చులు తగ్గించుకోవాలంటే వ్యాపార విస్తరణను తగ్గించుకోవచ్చు. కానీ ఉద్యోగులను ఉన్నఫలంగా ఇంటికి పంపేయడం కార్పొరేట్ కంపెనీల దారుణాలకు నిదర్శనం.

మెటా అధినేత జుకెర్ బర్గ్ వంటి గుత్తాధిపత్య దిగ్గజాలతో సెల్ఫీలు దిగేందుకు ఉత్సాహం చూపే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వంటి పాలకులకు ఆ సంస్థ వేటుకు బలైపోతున్న సిబ్బందిని పట్టించుకునే తీరిక ఎక్కడిది? ఉపాధి భద్రతను నీరుగార్చి కార్మిక చట్టాలన్నిటినీ మూడే మూడు కోడ్‌లుగా కుదించిన పాలకుల కళ్లకు ఐటి కంపెనీల దారుణాలు కానరావు. ఈ ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కొనేందుకు, ఉపాధి భద్రత కోసం ఐటి నిపుణులు పిడికిలి బిగించాల్సిన తరుణం ఇది.

మహనీయుల మాట



దేశం లోనూ, మొత్తం ప్రపంచం లోనూ రాజకీయ పరిస్థితి ఎప్పుడూ మార్పులకు లోనవుతుంటుంది. అందువల్ల పార్టీ ఎదుర్కొనే సమస్యల స్వభావం కూడా మారుతుంది. పార్టీ నాయకత్వం అలాంటి పరిణామాలను సదా గమనిస్తుండాలి. విశ్వజనీనమైన, కాల పరీక్షలో నిగ్గుదేలిన మార్క్సిస్టు లెనినిస్టు సూత్రాలకు అనుగుణంగా సరైన పంథాను రూపొందించగలగాలి.

- ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్,
మార్క్సిస్టు సిద్ధాంతవేత్త.

అడవి బిడ్డల చదువుకు సహకారం ఇలాగేనా?

విశ్లేషణ



ఎన్. వెంకటేశ్వర్లు

చదువు చైతన్యాన్ని ఇస్తుంది. నాగరికతను నేర్పుతుంది. జీవన ప్రమాణాలను పెంచుతుంది. అలాంటి చదువును ప్రభుత్వ బాధ్యతగా తీసుకొని అందరికీ నేర్పాలి. నేర్చుకోవడానికి కావలసిన పరిస్థితులను కల్పించాలన్న సంకల్పంతో గిరిజన ప్రాంతాలలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను స్థాపించారు. 1976 నుండి ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఈ బాధ్యతను చూస్తున్నది. గిరిజన విద్యారంగ సంస్కరణలలో భాగంగా 2006లో ప్రాథమిక పాఠశాలలను విభజించి ఒకటి రెండు తరగతులతో జిపిఎస్ పాఠశాలలు, 3-10 తరగతులతో ఆశ్రమ పాఠశాలలు ఏర్పరిచారు. ప్రాథమిక పాఠశాలల విభజన వద్దని పోరాటం చేసిన చోట కొన్ని పాఠశాలలు 1 నుంచి 5 వరకు యథాతథంగా కొనసాగుతున్నాయి. జిపిఎస్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఎక్కువ శాతం ఒక ఉపాధ్యాయునితోనే నడుస్తున్నాయి. గిరిజన విద్యారంగ సమస్యలను గుర్తించి అధికారులకు, ప్రభుత్వానికి యుటిఎఫ్ విన్నవించినా, పోరాటాలు చేసినా ఎలాంటి పరిష్కారాలకు నోచుకోలేదు.

ఈ నేపథ్యంలో గిరిజన విద్యారంగ సమస్యల పరిష్కారానికి యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అక్టోబర్ 17 నుండి 22 వరకు అన్ని ఐటిడిఎల లోని ఆశ్రమ, జిపిఎస్ పాఠశాలలను జీపు జాతా ద్వారా సందర్శించడం జరిగింది. ఈ జాతాలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలతో పాటు యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు. గతంలో గుర్తించిన సమస్యలతో పాటు, గిరిజన పాఠశాలల చుట్టూ అనేక సమస్యలను జాతా బృందం గుర్తించింది.

పాఠశాలల పరిస్థితి

ఆశ్రమ పాఠశాలలు, 3-10 తరగతుల పాఠశాలలు, పోస్ట్‌మెట్రిక్, గురుకులాలు, ఏకలవ్య పాఠశాలలు అన్నీ కలిపి 748 పాఠశాలలు ఉన్నాయి. వీటితోపాటు జిపిఎస్ 1-2 తరగతి పాఠశాలలు 1933 ఉన్నాయి. 98 శాతం జిపిఎస్ పాఠశాలలు ఒక ఉపాధ్యాయునితోనే నడుస్తున్నాయి. ఒక ఉపాధ్యాయునితో గిరిజన బాలబాలికలకు నాణ్యమైన విద్య ఎలా వస్తుందో ప్రభుత్వం, అధికారులు చెప్పాలి. ఎవరైనా ఉపాధ్యాయుడు అత్యవసర పని ఉండి సెలవు పెడితే, ఆరోజు మధ్యాహ్నం భోజనం కోసం మాత్రమే బడి నడుస్తుంది. విద్యారంగ సంస్కరణలను అమలు చేసేటప్పుడు ఇలాంటి ఇబ్బందుల గురించి యుటిఎఫ్ చెప్పినా అధికారులు చెవికెక్కించుకోలేదు. కొన్ని గ్రామాల్లో బడి ఈడు కలిగిన బాలబాలికలు ఆడుకుంటున్నారు లేదా తల్లిదండ్రుల పనిలో నిమగ్నమవుతున్నారు. బడిలో ఉండాల్సిన పిల్లలు పనిలో ఉంటే గిరిజన అభివృద్ధి సాధ్యమేనా?

విద్యార్థుల సమస్యలు

ఇప్పటికీ 2019 నాటి మెస్ చార్జీలనే కొనసాగిస్తున్నారు.



విద్యార్థులకు కడుపు నిండా భోజనం అందుతున్న పరిస్థితులు లేవు. రోజుకు మూడు-నాలుగు తరగతుల వారికి 33.34 పైసలు, 5-10 తరగతుల వారికి 41.66 పైసలు, ఇంటర్ వారికి 46.67 పైసలు మాత్రమే మెనూ ఛార్జీలు ఇస్తున్నారు. ఈ రోజుకి పెరిగిన రేట్ల ప్రకారం కాకుండా మూడు సంవత్సరాల క్రితం మెనూ చార్జీల ద్వారా ఎలాంటి నాణ్యమైన పోషక పదార్థాలు అందుతాయో కళ్లారా చూశాక మనసు ద్రవించిపోయింది. అర్థాకలితో గిరిజన బిడ్డలు చదువు నేర్చుకుంటారా? ప్రభుత్వం ఎందుకని ఈ మెస్ చార్జీల పెంపు వైపు ఆలోచించటం లేదు? 2019కి ముందు నాలుగు జతల యూనిఫామ్‌లు, ఒక జత వైట్ బట్టలు ఇచ్చేవారు. ఇప్పుడు మూడు జతల బట్టలు మాత్రమే ఇస్తున్నారు. గతంలో 22 నోట్ పుస్తకాలు ఇస్తే, ప్రస్తుతం 9 లేక 12 నోటు పుస్తకాలు ఇస్తున్నారు. కాస్మొటిక్ వస్తువుల సరఫరా లేదు. అనారోగ్యం వస్తే హాస్టల్‌లో ఎఎన్ఎం లేరు. ప్రాథమిక ఆసుపత్రికి తీసుకు వెళ్లడానికి వాహన సదుపాయాలు లేవు. విద్యార్థుల్ని ఉపాధ్యాయుల సొంత ఖర్చుతోనే ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లాల్సిన పరిస్థితులు ఉన్నాయి. హాస్టల్‌కి కావలసిన వస్తువులను పాఠశాల కేంద్రానికి సరఫరా చేయడానికి ఏర్పాట్లు లేవు. సెలవులకి ఇంటికి వెళితే మరల పాఠశాలకు రావడానికి బస్సు ఛార్జీలు లేక సకాలంలో బడికి రాని విద్యార్థుల సంఖ్య తక్కువేమీ లేదు. ఇలాంటి పరిస్థితుల్లో చదువు సాగించడం సాధ్యమా? మెనూ ఛార్జీలను నేటి రేట్ల ఆధారంగా సవరించాలి. గతంలో లాగా ఐదు జతల బట్టలు, కాస్మొటిక్ చార్జీలు చెల్లించాలి.

ఉపాధ్యాయుల సమస్యలు

నియమించబడింది విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి. చేస్తున్నది అటెండర్ నుంచి ప్లంబర్ పని వరకు అన్నీ. బోధనేతర కార్యక్రమాలతో వేదనకు గురవుతున్నారు. పిల్లల్ని కంటికి రెప్పలా కాపాడుకునే దానికోసం వార్డెన్ల డ్యూటీ చేస్తున్నారు. 98 శాతం ఆశ్రమ పాఠశాలలో వార్డెన్లు లేరు. ఉపాధ్యాయులే డిప్యూటీ వార్డెన్‌గా పనిచేస్తున్నారు. కొన్ని ఐటిడి లలో ఒకటి లేదా మూడు సంవత్సరాల చొప్పున రొటీన్ పద్ధతిలో ఒక్కొక్కరు, కొన్ని ఐటిడిఎ లలో మూడు నెలలకు ఒకరు చొప్పున ఉపాధ్యాయులే డిప్యూటీ వార్డెన్‌గా ఉంటున్నారు. ఈ కాలంలో విద్యార్థులకు ఇబ్బంది వస్తే తన ఉద్యోగం ఎక్కడ పోతుందోననే భయంతో ఏఎన్ఎం లను కుక్ లను, కమాటీలను సొంత డబ్బులు ఇచ్చి నియామకం చేసుకుంటున్నారు. పొరపాటున ఎక్కడైనా విద్యార్థికి ఇబ్బంది వస్తే వీరిని దోషులుగా చేసి శిక్షిస్తున్నారు. కొన్ని చోట్ల ఎలక్ట్రీషియన్ డ్యూటీ కూడా ఉపాధ్యాయులే చేస్తున్నారు. రాత్రి బస ఉండటానికి ఉపాధ్యాయులకు ప్రత్యేక గదులు, క్వార్టర్లు లేవు. అయినా రాత్రి బస చేయాలని ఉత్తర్వులు ఇచ్చారు. సుప్రీంకోర్టు జీవో 3 రద్దు చేశాక ప్రభుత్వం కోర్టుకు వెళ్ళింది. దానితోపాటు గిరిజన సంఘం వారు కోర్టుకు వెళ్లారు. ఇంకా పరిష్కారం కాలేదు. దీని వల్ల ప్రమోషన్ల ప్రక్రియ ఆగిపోయింది. అక్కడక్కడ అధికారులు జీవో నెంబర్ 3కి భిన్నంగా ప్రమోషన్ ఇస్తామని చెబుతున్నారు. మూడు డివైఇవో పోస్టులు, రెండు డిఈవో, పూర్తి ఏజెన్సీ మండలాల్లో ఎంఈవో పోస్టులు గిరిజన పాఠశాలల్లో పనిచేస్తున్న అర్హత కలిగిన ఉపాధ్యాయులతో పూరించాల్సి ఉంది. ఈ ప్రక్రియ ప్రస్తుతం అగమ్య గోచరంగా ఉంది. 524 పైగా పండిట్, పిఇటి పోస్టుల అప్‌గ్రేడేషన్ ఆర్థిక శాఖ కొర్రీ వల్ల ఆగిపోయింది. ప్రధానోపాధ్యాయుల ప్రమోషన్లు లేవు. అర్హత కలిగిన వారికి జూనియర్ కళాశాల అధ్యాపకుల ప్రమోషన్లు ఇవ్వడం లేదు. జీవో నెంబర్ 3ని యథాతథంగా అమలు చేయడానికి కావలసిన చర్యలు తీసుకొని ప్రమోషన్ ప్రక్రియను వేగవంతం చేయాల్సి ఉంది. ఆర్థిక శాఖ అవాంతరాలను అధిగమించి అప్‌గ్రేడ్ ప్రక్రియను పూర్తి చేయాలి. వార్డెన్ పోస్టులను భర్తీ చేయాలి. ఎఎన్ఎం నియామకాలను చేపట్టాలి. ఎలక్ట్రీషియన్, ప్లంబర్లతో పాటు పాఠశాలలో బోధనేతర సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్, వాచ్‌మెన్, అవసరం ఉన్న చోట కమాటి, కుక్ లను నియమించాలి.

98 శాతం జిపిఎస్ పాఠశాలలు ఒక ఉపాధ్యాయునితోనే నడుస్తున్నాయి. ఒక ఉపాధ్యాయునితో గిరిజన బాలబాలికలకు నాణ్యమైన విద్య ఎలా వస్తుందో ప్రభుత్వం, అధికారులు చెప్పాలి. ఉపాధ్యాయుడు ఎప్పుడైన అత్యవసర పని ఉండి సెలవు పెడితే, ఆరోజు మధ్యాహ్న భోజనం కోసం మాత్రమే బడి నడుస్తుంది. విద్యారంగ సంస్కరణలను అమలు చేసేటప్పుడు ఇలాంటి ఇబ్బందుల గురించి యుటిఎఫ్ చెప్పినా అధికారులు చెవికెక్కించుకోలేదు. కొన్ని గ్రామాల్లో బడి ఈడు కలిగిన బాలబాలికలు ఆడుకుంటున్నారు. లేదా తల్లిదండ్రుల పనిలో నిమగ్నమవుతున్నారు. బడిలో ఉండాల్సిన పిల్లలు పనిలో ఉంటే గిరిజన అభివృద్ధి సాధ్యమేనా?

సి.ఆర్.టి వ్యవస్థ

గిరిజన పాఠశాలల్లో విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయుల నియామకం లేకపోవడం వల్ల గిరిజన ప్రాంతాలలో అర్హత కలిగిన వారిని సిఆర్‌టి లుగా నియమించారు. రాష్ట్రంలో 1798 మంది సిఆర్‌టి లుగా పని చేస్తున్నారు. గతంలో పది రోజుల గ్యాప్‌తో 12 నెలల జీతం చెల్లించేవారు. గడిచిన సంవత్సరంగా పది నెలల జీతం మాత్రమే చెల్లిస్తున్నారు. 12 సెలవులు మాత్రమే ఇస్తున్నారు. రెగ్యులర్ ఉపాధ్యాయుల్లా పనిచేస్తున్నా సదుపాయాలు సక్రమంగా ఇవ్వడం లేదు. అత్యంత దుర్భర పరిస్థితుల్లో విద్యాభ్యాసాన్ని పూర్తి చేసి, క్వాలిఫై అయిన వారికి ఇంత తక్కువ జీతం ఇవ్వటం న్యాయం కాదు. ప్రతి సంవత్సరం రెన్యువల్ చేయించుకోవడానికి పోరాటం చేయాల్సి వస్తున్నది. కొన్ని పోస్టులు అవసరం లేదనే పేరుతో 186 మంది సిఆర్‌టి లను స్కూల్ అసిస్టెంట్ల నుండి ఎస్‌జిటి లుగా డీగ్రేడ్ చేశారు. సిఆర్‌టి వ్యవస్థ మొత్తాన్ని రెగ్యులర్ చేయాలి.

భాషా వాలంటీర్లు

గిరిజన భాషాభివృద్ధి కోసం జిపిఎస్ పాఠశాలల్లో భాషా వాలంటీర్లను సమగ్ర శిక్షా అభియాన్ నిధుల సహకారంతో ప్రభుత్వం నియమిస్తుంది. సుమారు 1242 మంది వివిధ భాషా వాలంటీర్లను ప్రభుత్వ ఈ సంవత్సరం నియమించాల్సి ఉంది. పాఠశాలలు ప్రారంభమై ఐదు నెలలు గడుస్తున్నా భాషా వాలంటీర్లను ఇంతవరకు నియమించలేదు. పాత బకాయిలు చెల్లించాలని, ఈ సంవత్సరం తిరిగి రెన్యువల్ చేయాలనే డిమాండ్‌తో 72 గంటల నిరాహార దీక్షలు చేసినా, ప్రభుత్వం పట్టించుకోలేదు. సమగ్ర శిక్షా అభియాన్ నిధులు కేటాయించినా ఏదో ఒక కొర్రీతో కొద్దిచోట్ల వాలంటీర్లను నియమించడం లేదు. కేవలం రూ.5000 జీతంతో నియమించే భాషా వాలంటీర్లు పాఠశాలలకు విద్యార్థులు రావడానికి, వారి భాషాభివృద్ధికి తోడ్పాటు అందిస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో వాలంటీర్లు లేకపోతే ఆ పాఠశాల మూత వేయాల్సిన పరిస్థితులు కూడా ఉన్నాయి. ఇలాంటి వాలంటీర్ల వ్యవస్థను ఏదో ఒక కారణంతో రెన్యువల్ చేయకపోవడం గిరిజన విద్యార్థులకు విద్యను అందించడానికా లేక గిరిజన భాషాభివృద్ధి చెందకుండా చేయడానికా అన్న అనుమానం కలుగుతుంది. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే భాషా వాలంటీర్ల నియామకానికి చర్యలు తీసుకోవాలి.

చదువు.. చైతన్యం..

2011 జనాభా లెక్కల ప్రకారం గిరిజన అక్షరాస్యత 58.96 శాతం. మహిళ అక్షరాస్యత 38 శాతం. స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న తరుణంలో ఈ గణాంకాలు ఎలాంటి సంకేతాలు ఇస్తున్నాయి? దేశంలో అన్ని వర్గాలు అభివృద్ధి చెందకుండా దేశం అభివృద్ధి చెందిందని...చెందుతోందని ఎలా చెప్పగలం? విద్యకు కావలసిన నిధులు సక్రమంగా కేటాయించకుండా, విద్య నేర్చుకోవడానికి వచ్చే విద్యార్థికి సదుపాయాలు కల్పించకుండా, గిరిజనుల విద్యాభివృద్ధి సాధ్యమా? చదువు నాగరికతను, నైపుణ్యాన్ని నేర్పాలి. ఆ నైపుణ్యం గౌరవప్రదమైన జీవనాన్ని సాగించడానికి కావలసిన చైతన్యాన్ని ఇవ్వాలి. చదువుకోడానికే ఇన్ని ఆటంకాలు ఏర్పడితే గిరిజనులు సంపూర్ణ మానవులుగా ఎలా తయారవుతారు?

పీసా చట్టం, 1/70 యాక్ట్, అటవీ హక్కుల చట్టం అమలు కోసం కృషి చేసే గిరిజన సంఘాలకు సంఘీభావం తెలపాలి. జీవో నెంబర్ 3, అప్‌గ్రేడేషన్, మెనూ చార్జీల పెంపు, ఏఎన్ఎం, వార్డెన్ నియామకం, ప్రమోషన్ లాంటి సమస్యల పరిష్కారానికి ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ చేసే పోరాటాలతో కలిసి పనిచేయడానికి సిద్ధం కావాలి. గిరిజన సంక్షేమం మా లక్ష్యం అని చెప్పే పాలకులు చిత్తశుద్ధితో గిరిజన సంక్షేమానికి బడ్జెట్‌లో నిధులను కేటాయించడం, ఖర్చు చేయడంతో పాటు విద్యారంగ సమస్యలు పరిష్కారానికి చొరవ చూపాలి. తద్వారా గిరిజన విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించాలి.

(వ్యాసకర్త : యుటియఫ్ రాష్ట్ర అధ్యక్షులు)

పోలవరంపై పడే దెబ్బకు ఉత్తరాంధ్ర చిత్తు!

సమస్య




వి. శంకరయ్య

పోలవరం రిజర్వాయర్ నిర్మాణ భవితవ్యం క్రమేణా ప్రమాదంలో పడుతోంది. 194 టియంసిల నీటి నిల్వ సామర్థ్యం దాదాపు 320 టియంసిలు నీటి వినియోగం నుండి వంద టియంసిలు (ఒరిజినల్ రిజర్వాయర్‌లో యండిడియల్ స్థాయికి) నిల్వ చేయగల ఒక బ్యారేజీగా మిగిలి పోయే ప్రమాదం వస్తోంది. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమౌతోంది. త్వరలో కేంద్రం పచ్చ జెండా ఊపవచ్చు. విషాదమేమంటే తొలుత ప్లానింగ్ కమిషన్ 2010-11 నాటి షెడ్యూల్ రేట్లతో 16010.15 రూపాయలు అంచనా వ్యయంతో ఆమోదించిన తొలి డిపిఆర్ తప్ప ఇన్నేళ్లు గడిచినా, పైగా జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించబడినా రెండవ డిపిఆర్ కేంద్ర ప్రభుత్వం ఇంత వరకు ఆమోదించ లేదు. అయితే ఇటీవల కాలంలో 41.15 (135 అడుగులు) మీటర్ల వరకే నిర్మాణం పరిమితం చేయబడుతుందని వస్తున్న వార్తలు వాస్తవమైతే తొలి దెబ్బ ఉత్తరాంధ్రపై పడుతుంది. విశాఖకు శాశ్వత తాగునీటి వసతి గల్లంతౌతుంది. దీనితో పాటు ఉత్తరాంధ్ర మూడు ఉమ్మడి జిల్లాలతో పాటు తూర్పు గోదావరి ఉమ్మడి జిల్లా మెట్ట ప్రాంతాలపై ఈ ప్రభావం తీవ్రంగా ఉంటుంది. వివరాల్లోకి వెళితే......

విశాఖ పట్టణానికి శాశ్వత తాగునీటి వసతి కోసం పోలవరం ప్రాజెక్టు నుండి 23.44 టియంసిల నీరు కేటాయించినారు. ఉత్తరాంధ్ర మూడు ఉమ్మడి జిల్లాల ప్రజలు ఎదురు చూస్తున్న ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకానికి 63.2 టియంసిలు గోదావరి వరద జలాలను పోలవరం ప్రాజెక్టు నుండి తరలించ వలసి వుంది.

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం ద్వారా మూడు ఉమ్మడి జిల్లాల్లో ఎనిమిది లక్షల ఎకరాలకు సాగు నీటి వసతి 1200 గ్రామాల్లో 30 లక్షల మందికి తాగునీటి సౌకర్యం సుజల స్రవంతి అమలు జరిగితే కల్పించబడుతుంది.

వీరందరికీ సాగు తాగు నీటి వసతి కల్పించకుండా పరి పాలన రాజధానితో ఉత్తరాంధ్రను ఏం ఉద్ధరించుతారు? పరిపాలన రాజధాని చేసిన తర్వాత సమూహమయ్యే లక్షలాది మందికి కనీసం తాగునీటి వసతి ఎలా కల్పించుతారు?



ఇంతటి ప్రాధాన్యత గల అదీ చట్టబద్దంగా జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరం ప్రాజెక్టు రెండవ డిపిఆర్ ఆమోదం తదనుగుణంగా పెట్టుబడి అనుమతి మొన్న విశాఖ సభలో ప్రధాన మంత్రి మోడీ నోట నుండి నామమాత్రంగా కూడా రాలేదు.

పోలవరం ప్రాజెక్టు భవితవ్యం గురించి చర్చలు జరిగినపుడల్లా రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి పోలవరం ప్రాజెక్టు ఎప్పుడు పూర్తవుతుందో చెప్పలేమని ప్రకటిస్తున్నందుకు అభినందించాలి. ఎందుకంటే నిజం నిర్భయంగా చెబుతున్నారు. కాని కొసమెరుపు ఏమంటే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డితో సహా ఇతర మంత్రులు డ్యాం సేఫ్టీ అండ్ స్టెబిలిటీ ప్రోటోకాల్ సిద్ధాంతం తెర మీదకు తెస్తున్నారు. ఇదేమీ కొత్తగా కనిపెట్టబడలేదు. కొత్తగా ఏ ప్రాజెక్టులోనైనా నీటి నిల్వ చేసే సమయంలో విధిగా అమలు చేయ వలసినదే. కొత్త ప్రాజెక్టులను ఏకంగా నీళ్లతో నింపరు. దాని మాటున పోలవరం ప్రాజెక్టు కుదించడానికి యత్నించడం దారుణం. పోలవరం ప్రాజెక్టు రెండవ డిపిఆర్ ఆమోదించి ఆ మేరకు పెట్టుబడి అనుమతి ఇచ్చి దశల వారీగా నిధులు విడుదల చేస్తే ఎవరికీ అభ్యంతరం ఉండదు. కాని ఇందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధంగా లేవు. రెండవ డిపిఆర్ ఆమోదించకుండా 41.15 మీటర్ల వరకే ఎన్నికల లోపు నిర్మాణం పూర్తి చేసి మమ అనిపించనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇదే వాస్తవమైతే పోలవరం ప్రాజెక్టు ఒక బ్యారేజీగా మిగిలిపోతుంది. పోలవరం ప్రాజెక్టు 45.72 (150 అడుగులు) మీటర్లకు నిర్మాణం జరిగితే నీటి నిల్వ సామర్థ్యం 194 టియంసిలు. ఇందులో యండిడియల్ (మినిమమ్ డ్రా డౌన్ లెవల్). 41.15 (135 అడుగులు) మీటర్లు మాత్రమే. ఈ స్థాయిలో కేవలం 119 టియంసిలు మాత్రమే వుంటాయి. ఇప్పుడు జరుగుతున్న కుట్ర ఏమంటే రెండవ డిపిఆర్ ఆమోదించకుండా పెట్టుబడి అనుమతి ఇవ్వకుండా కేవలం 41.15 మీటర్ల ఎత్తు నిర్మాణానికి పరిమితం చేసే యత్నాలు సాగుతున్నాయి. అంటే 90 టియంసిలు నిల్వ చేస్తారు. ఈ నీళ్లు కుడి ఎడమ కాలువలకు గ్రావెటీ ద్వారా తరలించడం కుదరదు. పోలవరం ఎడమ కాలువ "సిల్ లెవల్" 40.54 మీటర్లు మాత్రమే. అదే జరిగితే పోలవరం ప్రాజెక్టు నుండి గ్రావెటీ ద్వారా ఎడమ కాలువకు నీరు తరలించే అవకాశాలు వుండవు. ఈ నేపథ్యంలో విశాఖకు తాగునీరు గాని ఉత్తరాంధ్ర ఉమ్మడి మూడు జిల్లాల్లో సాగు, తాగు నీరు అందించేందుకు ప్రతిపాదించబడిన ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం సంగతేమిటి? కుడి కాలువ సిల్ లెవల్ కూడా 40.23 మీటర్లు మాత్రమే. తత్ఫలితంగా కుడి కాలువ ద్వారా కూడా గ్రావెటీ ద్వారా గోదావరి జలాలను తరలించే అవకాశం లేదు.

ఇప్పుడు రెండవ డిపిఆర్ ఆమోదించకుండా పెట్టుబడి అనుమతి ఇవ్వకుండా కేవలం 41.15 మీటర్ల ఎత్తు నిర్మాణానికి పరిమితం చేసే యత్నాలు సాగుతున్నాయి. అంటే 90 టియంసిలు నిల్వ చేస్తారు. ఈ నీళ్లు కుడి ఎడమ కాలువలకు గ్రావెటీ ద్వారా తరలించడం కుదరదు. పోలవరం ఎడమ కాలువ 'సిల్ లెవల్' 40.54 మీటర్లు మాత్రమే. అదే జరిగితే పోలవరం ప్రాజెక్టు నుండి గ్రావెటీ ద్వారా ఎడమ కాలువకు నీరు తరలించే అవకాశాలు వుండవు. ఈ నేపథ్యంలో విశాఖకు తాగునీరు గాని ఉత్తరాంధ్ర ఉమ్మడి మూడు జిల్లాల్లో సాగు, తాగు నీరు అందించేందుకు ప్రతిపాదించబడిన ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పథకం సంగతేమిటి?

కాగా ఈ పాటికే వున్న పట్టిసీమ ఎత్తిపోతల పథకం కుడి కాలువకు గతి అవుతుంది. కాబట్టి ఉత్తరాంధ్రతో పోల్చుకొంటే కుడి కాలువ ప్రాంతం కొంత మెరుగు. ఎడమ కాలువకు చుక్క నీరు వెళ్లే అవకాశం లేదు.

(వ్యాసకర్త : విశ్రాంత పాత్రికేయులు,
సెల్ :9848394013)

బాలలకూ హక్కులున్నాయ్

సందర్భం

ఏ దేశానికైనా బాలలే తరగని సంపద. అందుకే వారి రక్షణ, సంరక్షణ ఆయా ప్రభుత్వాల బాధ్యత, కర్తవ్యం కూడా. వారు బాల్యం నుంచే సంపూర్ణంగా ఎదగాలి. బాధ్యతాయుతమైన పౌరులుగా మారాలి. ఆ విధంగా ఉండేలా మన రాజ్యాంగంలో అనేక చట్టాలు రూపొందించారు. హక్కులు పెద్దవారికే కాదు. బాలలకు కూడా వర్తిస్తాయి. బాలల సంపూర్ణ వికాసానికి, అభివృద్ధికి అండగా నిలబడతామని, బాలల హక్కుల పరిరక్షణ కోసం కట్టుబడతామని 'అంతర్జాతీయ బాలల హక్కుల ఒడంబడిక' (యుఎన్‌సిఆర్‌సి) పేర్కొంది. దీని ప్రకారం గర్భస్థ శిశువు నుంచి 18 ఏళ్ల లోపు వారందరూ బాలలే అని తీర్మానించింది. ఆ విధంగా 1959లో ఐక్యరాజ్యసమితి బాలల హక్కులను ప్రకటించింది. 1989 నవంబరు 20న ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో 'బాలల హక్కుల ఒడంబడిక'పై అప్పట్లో 180 దేశాలు సంతకం చేశాయి. నవంబరు 20న అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవా'న్ని నిర్వహిస్తారు. ఆ విధంగా యుఎన్‌సిఆర్‌సి కి నేటితో 33 ఏళ్ళు నిండాయి. ప్రపంచ బాలల జీవితాలను మార్చడానికి, వారి అభ్యున్నతికి ఇన్నేళ్ళలో 'యుఎన్‌సిఆర్‌సి' చేసిన కృషి మరువలేనిది. అన్ని దేశాల ఆమోదం పొందిన ఏకైక తీర్మానం 'యుఎన్‌సిఆర్‌సి' అని చెప్పవచ్చు.

బాలల హక్కులను నాలుగు రకాలుగా చెప్పుకోవచ్చు. అవి...జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు, అభివృద్ధి చేందే హక్కు, భాగస్వామ్యపు హక్కు. అయితే ఈ 33 ఏళ్ళలో అవగాహన, ప్రచార లోపం వల్ల పలు చోట్ల నేటికీ బాలల హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో 33 ఏళ్ళ ఒడంబడికను సమీక్ష చేయాల్సిన అవసరం ఉంది. ఒడంబడికలో పేర్కొన్న అంశాల్లో ఇప్పటి




వరకు మార్పేమీ లేదు. అలాగే ఫలాన తేదీ లోగా ఒడంబడిక అంశాలను అమలు చేయాలని నిబంధన కూడా లేదు. ఇది నిరంతర ప్రక్రియగా పేర్కొనాలి. కాని 33 ఏళ్ళ తరువాత ప్రపంచ బాలల స్థితిగతులలో, వారి ఆలోచనల్లో అనేక కొత్త మార్పులు, కొత్త సమస్యలు వచ్చి చేరాయి. వాతావరణంలో మార్పులు, పరిసరాలలో మార్పులు, వలసలు, సంఘర్షణలు, నిరాదరణ-అన్యాయాలు, కుటుంబ కలహాలు, పేద-గొప్ప తారతమ్యాలు, సోషల్ మీడియా ప్రభావం వంటి అనేక సమస్యలతో ప్రపంచ బాలలు సతమతమవుతున్నారు. ఈ సమస్యలను ఎదుర్కొనడంలోను, పరిష్కారం పొందడంలోను సరైన మార్గదర్శనం అవసరం. కొత్త కొత్త సమస్యలతో బాలల హక్కులకు విఘాతం ఏర్పడుతున్నది. హక్కుల పరిరక్షణకు కొత్త మార్గాలను అన్వేషించాలి. ఉపశమనం పొందే విధంగా ప్రభుత్వంతో పాటు సమాజం బాధ్యత వహించాలి. స్నేహపూర్వక సమాజంలో మాత్రమే ఇది సాధ్యం. జాతి, జాతీయత, వర్ణ, మత, భాష, స్త్రీ, పురుష, సాంస్కృతిక భేదం లేకుండా ప్రపంచ చిన్నారులందరికి ఈ హక్కులు చెందాలన్నది బాలల హక్కుల అంతర్జాతీయ మహాసభ ఉద్దేశం. 'నేటి బాలలే నేటి పౌరులు' కాబట్టి ఆ దిశగా నడవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- నరవ ప్రకాశరావు,
బాలల హక్కుల కార్యకర్త,
సెల్: 9032477463

ఎన్నికల బాండ్ల విరాళాలు

రూ.10,246 కోట్లు..

కాషాయ పార్టీకి కనకవర్షం



న్యూఢిల్లీ : ఎన్నికల బాండ్ల పథకం మొదలయినప్పటి నుంచీ ఇప్పటివరకూ మొత్తం రూ.10,246 కోట్ల విరాళాలు వసూలయ్యాయని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాజాగా గణాంకాలు విడుదల చేసింది. కోటి రూపాయలు విలువజేసే బాండ్లు 93.5శాతం ఉన్నాయని పేర్కొన్నది. మొత్తం అమ్ముడుపోయిన బాండ్లలో కోటి విలువ జేసేవే అత్యధికశాతం ఉన్నాయని దీంతో తేలిపోయింది. ఈ పథకాన్ని ఉపయోగిస్తున్నది బడా కార్పొరేట్లు, అత్యంత ధనికులేనని, సామాన్యులెవరూ కోటి రూపాయలు పార్టీ విరాళంగా ఇవ్వరు కదా..! అని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. మార్చి 2018 నుంచి ఇప్పటివరకూ బాండ్ల పథకంలో లక్ష, పదివేలు, వెయ్యి విలువగలవి కేవలం 0.26శాతం మాత్రమే ఉన్నాయని గణాంకాలు చెబుతున్నాయి. ఇప్పటివరకూ బాండ్ల పథకంలో కొనుగోలు అయిన కోటి, పది లక్షలు, లక్ష, పదివేలు, వెయ్యి.. విలువైన బాండ్ల వివరాలివ్వాలని సమాచార హక్కు కార్యకర్త చంద్రశేఖర్ గౌర్ చేసుకున్న అర్జీకి దరఖాస్తుకు ఎస్‌బిఐ పై గణాంకాలు విడుదల చేసింది.

బిజెపికే అత్యధిక విరాళాలు

2018 మార్చిలో బాండ్ల పథకాన్ని మోడీ సర్కార్ తీసుకొచ్చింది. ప్రతిపాటి రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని ముఖ్య నగరాల్లోని ఎస్‌బిఐ బ్యాంక్ వద్ద 15 రోజులపాటు బాండ్ల కొనుగోలు పథకం ప్రవేశపెడుతోంది. ఈ పథకం మొదలయ్యింది అధికార బిజెపి కనకవర్షం కురిపిస్తోంది. వేల కోట్ల రూపాయలు బడా కార్పొరేట్, అత్యంత ధనిక వర్గాల నుంచి ఆ పార్టీకి వచ్చి పడుతున్నాయి. బాండ్ల కొనుగోలు చట్టబద్దం కాదని, తెరవెనుక కార్యొరేట్లకు అనేక ప్రయోజనాలు కల్పిస్తూ.. వాటికి ప్రతిఫలంగా బాండ్ల పథకం ద్వారా అధికార బిజెపి విరాళాలు సేకరిస్తోందని సామాజిక కార్యకర్తలు, ప్రతిపక్ష నాయకులు విమర్శిస్తున్నారు. ఈ పథకానికి వ్యతిరేకంగా వామపక్షాలు, కాంగ్రెస్, సామాజిక కార్యకర్తలు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఇప్పటికి చాలాకాలం క్రితమే ఆశ్రయించారు.

ఉత్తరాఖండ్‌లో రోడ్డు ప్రమాదం : 11 మంది మృతి

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్‌లోని చమోలి జిల్లాలో టాటా సుమో లోయలో పడి..11 మంది మృతి చెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. మరో ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు. జోషిమత్ ప్రాంతంలోని ఉర్గామ్ వద్ద శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. టాటా సుమోలో 16 మంది ప్రయాణికులున్నట్లు చమోలి ఎస్‌పి ప్రమేంద్ర దోహల్ తెలిపారు. సహాయక బృందాలు అక్కడకు చేరుకుని గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించారు.

తీవ్రవాదానికి అందే నిధుల మూలాలపై దాడి కీలకం : మోడీ

న్యూఢిల్లీ : తమ విదేశాంగ విధానంలో భాగంగా కొన్ని దేశాలు తీవ్రవాదానికి మద్దతునిస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. తీవ్రవాదానికి ప్రభుత్వ మద్దతు వుండడమనేది తీవ్రవాద గ్రూపులకు నిధులు అందుతున్న కారణాల్లో ఒకటిగా వుందని అన్నారు. తీవ్రవాద గ్రూపులకు కొన్ని దేశాలు రాజకీయ, సైద్ధాంతిక, ఆర్థిక తోడ్పాటును అందిస్తూ, మరోవైపు తీవ్రవాదులపై చర్య తీసుకోకుండా నివారించేందుకు తీవ్రవాదానికి మద్దతిస్తూ పరోక్షంగా వాదనలు వినిపిస్తున్నాయని అన్నారు. అనేక దశాబ్దాలుగా భారత్ తీవ్రవాద బాధిత దేశంగా వుందన్నారు. పరోక్ష యుద్ధాలనేవి చాలా ప్రమాదకరమని అన్నారు. తీవ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించేందుకు ప్రపంచ దేశాలన్నీ ఒక్క తాటిపైకి రావాల్సిన అవసరం వుందన్నారు. 'నో మనీ ఫర్ టెర్రర్ కాన్ఫరెన్స్' మూడో అంతర్జాతీయ సదస్సు ప్రారంభ సమావేశంలో మోడీ ప్రసంగించారు. ఈ సమావేశానికి 72 దేశాల నుంచి 450మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఇంటర్‌పోల్, ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్‌ఎటిఎఫ్) వంటి ఇతర సంస్థల నుండి కూడా పాల్గొన్నాయి.

తీవ్రవాదానికి మతంతో ముడిపెట్టరాదు : అమిత్ షా

ఇదే సమావేశంలో అంతర్జాతీయ ప్రతినిధులను ఉద్దేశించి హోం మంత్రి అమిత్ షా మాట్లాడుతూ తీవ్రవాద ముప్పును ఏ మతం, జాతీయత లేదా గ్రూపుతో ముడిపెట్టరాదని అన్నారు. 2021లో దక్షిణాసియాలో ప్రభుత్వాలు మారిన తర్వాత పెరుగుతున్న అల్‌ఖైదా, ఇస్లామిక్ స్టేట్ ప్రభావాలు ప్రధాన భద్రతా సవాళ్లుగా ఆవిర్భవించాయన్నారు.

ఎన్‌ఐఎకు తలంటిన సుప్రీం

- నవలఖాను 24 గంటల్లో జైలు నుంచి గృహ నిర్బంధంలోకి తరలించాలని ఆదేశం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

హక్కుల కార్యకర్త, భీమా కోరేగావ్ నిందితుడు గౌతం నవలఖాను జైలు నుంచి గృహ నిర్బంధానికి తరలించడాన్ని వ్యతిరేకిస్తూ జాతీయ దర్యాప్తు ఏజెన్సీ (ఎన్‌ఐఎ) దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయ స్థానం తిరస్కరించింది. తనకు గృహ నిర్బంధానికి అనుమతిస్తూ ఈ నెల 10న సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయడం లేదని గౌతం నవలఖా సుప్రీం కోర్టును ఆశ్రయించారు. గృహ నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ ఎన్‌ఐఎ కూడా సుప్రీం కోర్టును ఆశ్రయించింది. దీనిపై శుక్రవారం సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కెఎం జోసెఫ్, జస్టిస్ హృషికేష్ రాయ్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఉత్తర్వులను 24 గంటల్లోగా అమలు చేయాలని ఆదేశించింది. నవలఖా గృహ నిర్బంధాన్ని దుర్వినియోగం చేయకుండా ఉండేలా అదనపు రక్షణలను తప్పనిసరి చేసింది. నవలఖాను గృహ నిర్బంధంలో ఉంచాలనుకుంటున్న ప్రాంతం కమ్యూనిస్టు పార్టీకి చెందినదని ఎన్‌ఐఎ లేవనెత్తిన అభ్యంతరాన్ని ధర్మాసనం తిరస్కరించింది. "కమ్యూనిస్టు పార్టీ దేశంలో గుర్తింపు పొందిన పార్టీ. సమస్య ఏమిటి" అని ఎన్‌ఐఎ తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను జస్టిస్ జోసెఫ్ ప్రశ్నించారు. నవలఖా తరపున సీనియర్ న్యాయవాది నిత్యా రామకృష్ణన్ వాదిస్తూ, నవలఖా బసకు ప్రతిపాదించిన స్థలం రెసిడెన్షియల్ యూనిట్ అని తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (మార్క్సిస్టు) మావోయిస్టుల విధానాలకు వ్యతిరేకమని, సామాజిక రాజకీయాల్లో ప్రాథమిక పక్షపాతం ఉన్న ఎవరికైనా తెలుసని నిత్యా పేర్కొన్నారు. "మా ఆర్డర్‌ను పాటించకుండా, కొన్ని లొసుగులను వెతుకుతున్నారు. మేము దానిని తీవ్రంగా పరిగణించాం" అని జస్టిస్ జోసెఫ్ పేర్కొన్నారు. 'మీ పోలీసు బలగాలతో అనారోగ్యంతో ఉన్న 70 ఏళ్ల వృద్ధుడిపై నిఘా ఉంచలేరా?' అని జస్టిస్ రాయ్ ప్రశ్నించారు. గౌతం నవలఖా గృహ నిర్బంధంలో ఉండేందుకు ముంబైలోని బిటి రణదివే భవన్‌లో లైబ్రరీపైన గదిని సిపిఐ(ఎం) కేటాయించింది.

రోజుకు 130 బెయిల్, 130 బదిలీ కేసులు : సిజెఐ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



ప్రతి ధర్మాసనం ప్రతిరోజూ కుటుంబ వివాదాలకు సంబంధించిన 10 బదిలీ పిటిషన్లను, 10 బెయిలు పిటిషన్లను విచారణకు చేపట్టాలని నిర్ణయించినట్లు సిజెఐ జస్టిస్ డివై చంద్రచూడ్ తెలిపారు. శుక్రవారం జరిగిన ఫుల్ కోర్ట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. బెయిలు పిటిషన్లు వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించినవి కాబట్టి ప్రాధాన్యం ఇవ్వవలసిన అవసరం ఉందని చెప్పారు. వైవాహిక వివాదాలకు సంబంధించిన కేసుల్లో పార్టీలు తమకు నచ్చిన చోటుకు విచారణ బదిలీ చేయాలని కోరుతున్నాయన్నారు. ప్రస్తుతం సుప్రీంకోర్టులో బదిలీ పిటిషన్లు సుమారు 13,000 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రతి ధర్మాసనం రోజుకు 10 ట్రాన్స్‌ఫర్ కేసులను చేపడితే, సుప్రీంకోర్టులోని మొత్తం 13 ధర్మాసనాలు రోజుకు 130 కేసులను, వారానికి 650 కేసులను పరిష్కరించగలుగుతాయని తెలిపారు. ఐదు వారాలు ముగిసే సరికి, శీతాకాలం సెలవులకు ముందు, అన్ని ట్రాన్స్‌ఫర్ పిటిషన్లపై విచారణ పూర్తవుతుందన్నారు. అనుబంధ జాబితాలో చేర్చబడిన క్రమంలో సమాచారం చేసే కేసుల సంఖ్యను తగ్గించాలని నిర్ణయించినట్లు తెలిపారు. అర్థరాత్రి 12 గంటల వరకు, తెల్లవారుజాము వరకు కేసు ఫైళ్లను చదువుతున్న పరిస్థితిని న్యాయమూర్తులు ఎదుర్కొన్న కారణంగా, వారిపై పని భారాన్ని తగ్గించాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

దస్త్రాలు లేని న్యాయవాది... బ్యాండ్ లేని సచిన్‌తో సమానం

జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ హిమ కోహ్లీ ధర్మాసనం ముందుకు శుక్రవారం ఓ కేసు విచారణకు వచ్చింది. ఈ కేసులో వాదనలు వినిపించవలసిన న్యాయవాది వేరొకరి సంబంధిత కేసు ఫైలు లేకుండానే వచ్చారు. సిజెఐ స్పందిస్తూ క్రికెట్ ఆట ఆడేందుకు బ్యాట్ లేకుండా వెళ్లిన సచిన్ టెండూల్కర్ వంటివారని అగ్రహం వ్యక్తం చేశారు. ఇది సరికాదన్నారు. గౌన్, బ్యాండ్ ధరించి వచ్చారని, కానీ దస్త్రాలు లేవని అన్నారు. "మీ బ్రీఫ్ (కేసు ఫైలు) ఎల్లప్పుడూ మీ వెంట ఉండాలి" అని చెప్పారు.

అలసిన శబరిమల యాత్రికుడికి మంత్రి సేవలు



తిరువనంతపురం : కాలు నొప్పితో అలసిపోయి రోడ్డుపక్కన పడుకుని ఉన్న శబరిమల యాత్రికుడిని కేరళ దేవాదాయశాఖ మంత్రి కె. రాధాకృష్ణన్ పరామర్శించి, సేవలందించారు. కాలులో కండరాల నొప్పి రావడంతో ఓ యాత్రికుడు శబరిమల సన్నిధానానికి వెళ్లే మార్గంలో గురువారం పడుకుని ఉన్నాడు. శబరిమల సందర్శించి వెళ్తూ, ఈ విషయాన్ని గమనించిన మంత్రి ఆగి యాత్రికుడి వద్దకు వచ్చి వివరాలు అడిగారు. ఆయన కాలికి మసాజ్ చేసి, సాంత్వన చేకూర్చారు.

ఇ-పంటే..!

(మొదటి పేజీ తరువాయి)

శాతం అసలు విత్తనం పడలేదని రైతులు చెబుతున్నారు. అంటే 15-20 లక్షల ఎకరాల్లో సాగు లేదు. కానీ ఇ-క్రాప్‌లో మాత్రం ఆ పొలాల్లో పంటలు వేసినట్లు నమోదు చేసినట్లు ఆరోపణలొస్తున్నాయి. నీటి వసతి కలిగిన ప్రాంతాల్లో వరి సైతం పూర్తి స్థాయిలో సాగు కాలేదు. అయినా సాగైనట్లు ఆన్‌లైన్‌లో ఎక్కించారని ఆరోపణలొస్తున్నాయి.

స్కీముల ఎర

ఇ-క్రాప్ ఉద్దేశం పక్కాగా సాగుల నమోదు. కాగా అది అక్రమాలకు, అవకతవకలకు బాగా పనికొస్తోంది. ప్రతి పొలం వద్దకూ సిబ్బంది వెళ్లి రైతును పంట మధ్యలో నించోపెట్టి ఫొటో తీసి బయోమెట్రిక్ పద్ధతిలో వేలిముద్రలు తీసుకొని వెబ్‌లాండ్‌లో భూమి వివరాలు సరిచూసి అప్‌లోడ్ చేయాలి. ఫొటోను అప్‌లోడ్ చేయకపోయినా పర్వాలేదనే సడలింపు ఉన్నందున పంట వేసినా వేయకపోయినా వేలిముద్రలు తీసుకొని అప్‌లోడ్ చేస్తున్నారు. రైతు భరోసా, సబ్సిడీ సీడ్ తీసుకుంటే తప్పనిసరిగా పంట వేయాలని, వేయకపోయినా వేసినట్లు నమోదు కావాలని రైతులను మభ్యపెట్టి రికార్డుల్లో ఎక్కిస్తున్నారు. సున్నావడ్డీ, ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా, పంట రుణాల రెన్యువల్స్ అని లోబరుచుకుంటున్నారు. ఇదిలా ఉండగా, ఇ-క్రాప్‌లో సాగు సాధారణ స్థాయిలో జరిగితే కరువు, వరదలు, డ్రై-స్పెల్స్ వచ్చినా కరువు, విపత్తు మండలాలు ప్రకటించకుండా ప్రభుత్వం తప్పించుకునేందుకు 'ఇ-పంట' బాగా ఉపయోగపడుతోందన్న ఆరోపణలొస్తున్నాయి. రైతులు ప్రభుత్వ సంస్థలకు పంటలు అమ్ముకోవాలంటే ఇ-క్రాప్ తప్పనిసరి. ప్రైవేటు వ్యాపారులు రైతుల నుంచి తక్కువకు పంటలు కొనుగోలు చేసి, పంట వేయని రైతుల వద్ద నుంచి ఇ-క్రాప్ పత్రాలను సేకరించి, వాటితో ప్రభుత్వానికి మద్దతు ధరపై అమ్ముకుంటున్నారు. రైతులేమో పెట్టుబడి ఖర్చులు పెరిగి సాగు పట్ల విముఖత చూపుతున్నారు.

ప్రైవేటుకు హు'షార్'!

(మొదటి పేజీ తరువాయి)

పేరు పెట్టామని చెప్పారు. హైదరాబాద్‌కు చెందిన ప్రైవేటు స్కైరూట్ ఏరో స్పేస్ సంస్థ సింగిల్ స్టేజ్ సబ్- ఆర్బిటల్ లాంచ్ వెహికల్ గా ఈ రాకెట్‌ను రూపొందించింది. ఇది మూడు పేలోడ్‌లను అంతరిక్షంలోకి తీసుకెళ్లింది. తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో రాకెట్‌ను రూపొందించినట్లు స్కైరూట్ ఏరో స్పేస్ చైర్మన్ పవన్ గోయాంక్ తెలిపారు. ఇస్రో, ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ (ఇన్-స్పాక్) సంస్థల నుంచి వచ్చిన సహకారంతోనే ఈ ప్రయోగం జరిగిందని చెప్పారు. ఈ ప్రయోగ సమయంలో ఇస్రో చైర్మన్ డాక్టర్ సోమనాథ్, స్పేస్ డైరెక్టర్ అజయ్ జ్యోతి, షార్ డైరెక్టర్ రాజారాజన్, ప్రయోగంలో కీలక వ్యక్తులు స్కైరూట్ డైరెక్టర్లు భరత్ కుమార్, పవన్ చంద్ తదితరులు పాల్గొన్నారు.

వీడని ప్రతిష్టంభన

(మొదటి పేజీ తరువాయి)

చేయాలని గురువారం పొద్దుపోయిన తర్వాత యురోపియన్ యూనియన్ ప్రతిపాదించింది.

అమెరికా, చైనాలు ప్రతిష్టంభనను పరిష్కరించాలి ఆర్థిక వేత్త రాచెల్ క్లీటస్

అందరి కళ్లూ ఇప్పుడు ప్రపంచంలోనే ప్రధాన కాలుష్య కారక దేశాలైన అమెరికా, చైనాపైనే వున్నాయని ప్రముఖ ఆర్థిక వేత్త రాచెల్ క్లీటస్ వ్యాఖ్యానించారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ సదస్సులో పక్కన కూర్చోవడానికి ఇక అమెరికాకు ఎంత మాత్రమూ సమయం లేదన్నారు. తమ వైఖరి ఏమిటనేది వెల్లడించాలని, నిర్మాణాత్మకంగా వ్యవహరిస్తున్నామని అమెరికా నిరూపించుకోవాల్సి వుంటుందని అన్నారు. నిధి ఏర్పాటుపై చైనా కూడా తమ వైఖరిని స్పష్టం చేయాల్సి వుందన్నారు. "పొడిగించిన ఈ 24గంటల సమయంలో ఈ రెండు దేశాలు తమ వైఖరులను వెల్లడించి ప్రతిష్టంభనను పరిష్కరించాలి." అని ఆమె స్పష్టం చేశారు.



మీ కోసం

ఒక టేబుల్ స్పూను తేనెలో అర టేబుల్ స్పూను అల్లం రసం కలిపి రోజుకు మూడుసార్లు తీసుకుంటే జలుబు తగ్గుతుంది.

జీవన సౌరభం

కేవలం విజయాల నుండే కాదు, అపజయాల మీద నుంచీ ఎదగడం నేర్చుకోవాలి.

ఏ రోజు పాఠాలు ఆ రోజే ...



రాము, వెంకటేష్ ఇరుగుపొరుగు ఇళ్లలో ఉండేవారు. ఇద్దరూ ఒకే స్కూల్లో ఒకే తరగతి చదువుతున్నారు. రాము బుద్ధిమంతుడు. తెలివైనవాడు. చక్కగా బడికి వెళ్ళి బాగా చదువుకునేవాడు. మంచి మార్కులు తెచ్చుకోవాలని తపన పడేవాడు. ఎ

వెంకటేష్ ఇందుకు పూర్తి వ్యతిరేకం. బడికి సరిగా వెళ్లేవాడు కాదు. పాఠాలు చదువు మీద శ్రద్ధ పెట్టవాడు కాదు. ఎప్పుడూ రోడ్ల వెంట తిరుగుతూ గోలీలు, బొంగరాలు ఆడుకుంటూ కాలం వృథా చేసేవాడు. ఇంట్లో తల్లిదండ్రులు, బడిలో ఉపాధ్యాయులు వెంకటేష్‌ను కోప్పడేవారు. రాము ఎంత బాగా చదువుకుని, మంచి మార్కులు తెచ్చుకుంటున్నాడో చూడు అనేవారు. దాంతో వెంకటేష్‌కి... రాము మీద ద్వేషం ఏర్పడింది.

ఆరు నెలల పరీక్షలు దగ్గర పడ్డాయి. రామును ఎలాగైనా పరీక్షలో ఫెయిల్ అయ్యేలా చేయాలనుకున్నాడు. వరండాలో ఉన్న పుస్తకాల బ్యాగు ఎవరూ చూడకుండా బావిలో పడేశాడు. దాంతో రాము తల్లిదండ్రులు చాలా బాధపడ్డారు. రాము ఏడ్చాడు.

మరుసటి రోజే పరీక్షలు. బాధపడకుండా రాము చక్కగా పరీక్షలు రాశారు. వెంకటేష్ సరిగా రాయలేకపోయాడు. పరీక్ష ఫలితాలు వచ్చాయి. రాము ఫస్ట్ క్లాసులో పాసయ్యాడు. దాంతో వెంకటేష్ ఆశ్చర్యపోయాడు. రాము దగ్గరకెళ్లి 'నీ పుస్తకాలు పోయాయన్నావు కదా! పరీక్షల్లో ఎలా పాసయ్యావు?' అని అడిగాడు.

అందుకు రాము 'నేను ఏ రోజు పాఠాలు ఆ రోజే చదువుకున్నాను. దానికి సంబంధించిన నోడ్సూ స్వంతంగా రాసుకున్నాను. అందుకే పుస్తకాలు పోయినా పరీక్షలు రాయగలిగాను' అని చెప్పాడు. రాము ప్రతిభ తెలుసుకున్న వెంకటేష్ పశ్చాత్తాపపడ్డాడు. రాముని క్షమించమని కోరాడు. ఆ రోజు నుంచి రాముతో స్నేహంగా ఉంటూ చదవడం ప్రారంభించాడు.



- షేక్ వసీఖ్
8వ తరగతి,
కృష్ణవేణి ఉన్నత పాఠశాల,
యర్రగొండపాలెం,ప్రకాశం జిల్లా.



ఎవరి నీడ ఏది?

చిన్నారులూ, ఇక్కడ కొంతమంది పిల్లలు రకరకాల వేషధారణలో ఉన్నారు. ఎదురుగా వారి నీడలు ఉన్నాయి. ఎవరి నీడ ఏదో కనిపెట్టి జతచేయండి.

నేను గీసిన బొమ్మ



- కె. సరళ,
కె. సరళ ఇవంజెలిన్,
4వ తరగతి,
జూబిలీ మెమోరియల్ స్కూలు,
కొంతమూరు,
రాజమండ్రి రూరల్.




పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

గేలి చేయడం హేయమైన చర్య!

ఏయ్ పొట్టి.. ఇలా రా.., ఓయ్ గడకర్ర ఏం చేస్తున్నావ్!, ఏంటి బోండాం ఇలా వచ్చావ్.. ఏంట్రా పొట్ట అలా పెంచావ్.. అబ్బ మొఖం చూడు కాకిలా.. ఆ ముక్కేంటి గద్దలా.. ఎక్కువగా తినకు లావౌవుతావు.. అలా తినకుండా ఉంటే బద్దలా తయారవుతావు.. ఇలా ఒకటా రెండా చిన్న, పెద్దా తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఎప్పుడో ఒకప్పుడు ఈ మాటలు పడే ఉంటారు. ఒక్కోసారి నవ్వుకుంటాం.. మరోసారి చివుక్కుమంటాం... ఇదంతా సరదాకే అని కొట్టి పారేస్తాం. అలా వదిలేయబట్టే ఆ మాటలు శృతిమించి ఇతరులను గేలి చేయడానికి, హీనంగా అవమానించడానికి సాధనాలుగా ఉపయోగించుకుంటున్నారు. ఈ రకమైన మాటలు పడి అవమానభారంతో ప్రాణాల మీదకి తెచ్చుకున్న వాళ్లు కూడా ఉంటారు. మన శరీర రంగు, ఆకారంపై చేసే ఈ రకమైన కామెంట్లు తీవ్రరూపం దాల్చి బాడీ షేమింగ్‌కు దారితీస్తున్నాయి. ఇలాగే వదిలేస్తే.. ఇదే శృతిమించితే జరిగే అనర్థాలు అన్నీ ఇన్నీ కావు. 'దీన్ని ఆదిలోనే అడ్డుకట్ట వేయాలి.. ఎలా..?' అన్న ఆలోచనకు ఆచరణగా కేరళ ప్రభుత్వం ఓ ప్రగతిశీల నిర్ణయం తీసుకుంది. పాఠ్య పుస్తకాల్లో బాడీ షేమింగ్ వ్యతిరేక అవగాహన అంశాలను పాఠ్యాంశాలుగా చేర్చేందుకు నిర్ణయించింది.

ఈ నిర్ణయం తీసుకోవడం వెనుక కేరళ విద్యాశాఖమంత్రి తన స్వీయ అనుభవాన్ని ప్రస్తావించారు. 'ఒక రోజు ఫేస్‌బుక్ ఖాతాలో నేను పోస్టు చేసిన నా ఫొటోపై కొంతమంది కామెంట్ చేశారు. పొట్ట తగ్గించుకోమని సలహా ఇచ్చారు. అప్పుడు 'ఈ రకమైన బాడీ షేమింగ్ చేయడం చాలా హేయమైన చర్య' అని నేను బదులిచ్చాను' అంటున్న సదరు మంత్రివర్యులు తన స్నేహితుని కుమారుడికి ఎదురైన ఓ చేదు అనుభవాన్ని కూడా ఈ సందర్భంగా గుర్తుచేస్తుకున్నారు. 'ఒకసారి నా స్నేహితుడి కుమారుడు అతని శరీర రంగు కారణంగా స్కూల్లో గేలి చేయబడ్డాడు. దానిపై టీచర్లకు ఫిర్యాదు చేశాడు. అయినా తోటి విద్యార్థుల నుంచి అతనికి అవమానాలు ఎదురయ్యాయి.



తీవ్ర ఒత్తిడితో ఆ పిల్లవాడు వేరే స్కూల్లో చేరాడు. చాలాకాలం ఈ బాధ అతణ్ణి వేధించింది' అంటారు. ఇంకా 'మనం ఆధునిక మానవులుగా ఉండాలంటే గేలి చేయడాన్ని ఆపాలి' అంటున్నారు.

చాలా ఇళ్లల్లో పిల్లలను, పెద్దలను వారి శరీరాన్ని, ఆకారాన్ని, ఎత్తును, లావును కొలబద్దగా చేసుకుని పిలుస్తుంటారు. బావ మరదళ్లు, భార్య, భర్త, అక్కాచెల్లెళ్లు, అన్నాతమ్ముడు ఎప్పుడో ఒకప్పుడు



సరదాగా అనుకునే మాటలే కదా ఇంత పెద్ద విషయం చేయడమెందుకని అనుకోవచ్చు. కానీ బాడీ షేమింగ్‌ని అలా కొట్టిపారేయకూడదు. ఇది సరదాగా మాట్లాడుకునే విషయం కానేకాదు.

పాఠశాల స్థాయి నుంచే బాలబాలికలకు విద్య, ఉపాధి వంటి విషయాలపై అవగాహన పెంచుతారు. భవిష్యత్తు ప్రణాళికలకు మార్గం చూపిస్తారు. కాని బాల్యం నుంచే ఒకరికొకరు గౌరవించుకునే వాతావరణం కల్పించినప్పుడు రేపటి వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుంది. సమాజాభివృద్ధికి తొలి బీజం పాఠశాలస్థాయి నుంచే మొదలవ్వాలని కేరళ వామపక్ష ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై సర్వత్రా హర్షాతిరేకాలు వెల్లువెత్తుతున్నాయి.

చలి చలి చలి .. మనం ఇలా ఉండాలి!

చలికాలం వచ్చిందంటే శరీరాన్ని సంరక్షించుకోవాలని చాలా మంది ఆలోచిస్తారు. దానితో పాటు ఆహారపు అలవాట్లనూ మార్చుకుంటే ఈ కాలంలో ఎదురయ్యే సమస్యల నుంచి బయటపడొచ్చు. చలి నుంచి తక్షణ ఉపశమనం కోసం చాలా మంది టీ, కాఫీలు ఎక్కువగా తాగుతుంటారు. దీనివల్ల పొట్టలో అల్సర్ సమస్య తలెత్తుతుందని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

నీళ్లు తాగాలి

చలికాలంలో దాహం తక్కువగా అవుతుంది. దాంతో సరిపడన్ని నీళ్లు తాగకపోవడం వల్ల జీర్ణవ్యవస్థ సమస్యలు తలెత్తుతాయి. శరీరమూ పొడిబారుతుంది. అందుకే రోజులో కనీసం నాలుగు లీటర్ల నీటిని కొంచెం కొంచెంగా తీసుకోవాలి. దాహంగా లేదని నీళ్లు తాగకుండా ఉంటే శరీరం డీ హైడ్రేషన్ అవుతుంది. దాంతో ఆందోళన, నిద్రలేమి వంటి సమస్యలు తలెత్తుతాయి.



జంక్ ఫుడ్ తగ్గించాలి

చలికాలం వచ్చిదంటే చాలా మంది జంక్ ఫుడ్ అధికంగా తినేందుకు ఇష్టపడతారు. కారం కారంగా, వేడిగా ఉండాలంటూ బాగా మసాలా వేసి చేసే ఫుడ్‌ను తింటూ ఉంటారు. ఈ రకమైన ఆహారం జీర్ణకోశకు సంబంధించిన సమస్యలకు దారితీస్తుందని నిపుణులు చెబుతున్నారు. తరచూ ఆయిల్, మసాలా ఆహారం తీసుకోవడం వల్ల ఊబకాయం, మధుమేహం వంటి దీర్ఘ కాలిక సమస్యలకు దారి తీయొచ్చని విశ్లేషకులు చెబుతున్నారు.

అదుపులో కార్బొహైడ్రేట్స్

చలికాలంలో శరీరంలో సెరోటోనిన్ హార్మోన్ స్థాయిలు తగ్గుతాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. అందువల్ల మనకు ఎక్కువగా.. కార్బోహైడ్రేట్స్ ఉన్న ఆహారం తీసుకోవాలనే కోరిక కలుగుతుంది. రైస్, బ్రెడ్, అరటి, దుంపల్లో కార్బోహైడ్రేట్స్ ఎక్కువగా ఉంటాయి. ఇవి రోజూ తీసుకోవడం వల్ల రక్తపోటు, మధుమేహం స్థాయిలు పెరుగుతాయి. అందుకే ఈ ఆహారం పట్ల అదుపు అవసరం.

జలుబు, దగ్గు నుంచి ఉపశమనం

చలికాలంలో జలుబు, దగ్గు వచ్చినప్పుడు గాలి పీల్చుకోవడం, వదలడంలో ఇబ్బందులు ఎదురవుతాయి. అప్పుడు తీసుకునే పదార్థాల్లో కొన్ని నియమాలు పాటిస్తే త్వరగా ఉపశమనం కలుగుతుంది.

- తులసి ఆకుల్లో యాంటిబయాటిక్స్ ఎక్కువగా ఉంటాయి. ప్రతిరోజూ నాలుగు ఆకులు నోట్లో పెట్టుకుని, నిదానంగా నమలడం వల్ల జలుబు, ఫ్లూ రావు. కడిగిన తులసి ఆకులను మరిగించిన నీళ్లలో వేసి తాగితే గొంతులో కఫం నుంచి ఉపశమనం లభిస్తుంది.
- అల్లంలోని గుణాలు రోగనిరోధక శక్తిని బలపరచేలా చేస్తుంది. అందుకే జలుబు, వైరస్ బారిన పడిన వారికి త్వరగా కోలుకోవడానికి అల్లం సహాయపడుతుంది. గొంతు నొప్పితో బాధపడే వారు వేడి పాలలో గానీ, కషాయంలోగానీ అల్లం వేసుకుని తాగాలి.
- చిన్న పిల్లలకు జలుబు చేసినప్పుడు కఫం పేరుకుపోతుంది. అప్పుడు అరలీటర్ నీటిలో స్పూన్ వాముపొడి, స్పూన్ పసుపు వేసి చల్లారాక తేనె కలిపి కొంచెం కొంచెంగా తాపించాలి. దాంతో కఫం కరిగిపోతుంది. మెత్తగా దంచిన వామును ఒక స్పూన్, గ్లాస్ మజ్జిగకు కలిపి తీసుకోవడం వల్ల ఊపిరితిత్తులకు గాలిని చేరవేసే మార్గం శుభ్రపడుతుంది.
- రోజూ రాత్రి పడుకునే ముందు గోరువెచ్చని పాలల్లో కాస్త పసుపు, మిరియాల పొడి కలిపి తాగడం వల్ల రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు శరీరంలో చలి తగ్గుతుంది.
- కర్పూరాన్ని నువ్వులనూనెలో కరిగించి దాంతో తల, ఛాతీ, పాదాలకు మసాజ్ చేస్తూ ఉండాలి. జలుబు బాగా చేసినప్పుడు వేడినీటిలో స్పూను పసుపు, కర్పూరం వేసి ఆవిరిపట్టాలి.

'కీడా కోలా' ప్రారంభం

దర్శకుడిగా ప్రతిభ చాటిన తరుణ్ భాస్కర్ కొంతకాలంగా నటుడిగా కనిపిస్తున్నారు. 'ఒకే ఒక జీవితం', 'ఓరి దేవుడా' సినిమాలకు మాటలు అందించారు. తాజాగా మూడున్నరేళ్ల విరామం తరువాత తరుణ్ భాస్కర్ డైరెక్షన్ చేస్తున్న చిత్రం 'కీడా కోలా'. వీజీ సైన్మా క్విక్ ఫాక్స్.. బ్యానర్‌ల పై ఈ మూవీని తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీని సంచలన కథనంతో తెరపైకి తీసుకురాబోతున్నట్టుగా తెలుస్తోంది. తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో భారీ స్థాయిలో రిలీజ్ కానున్న ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ నవంబర్ 18న శుక్రవారం మొదలైంది.

25 నుంచి 'మీట్ క్యూట్'

నాని సమర్పకునిగా వస్తున్న అంథాలజీ సిరీస్ 'మీట్ క్యూట్' స్ట్రీమింగ్ తేదీ ప్రకటించారు. యువ నటీనటులు సునయన, అదా శర్మ, వర్షా బొల్లమ్మ, ఆకాంక్ష సింగ్, రుహానీ శర్మ, నటుడు సత్యరాజ్ తదితరులు నటించిన ఈ సిరీస్ నవంబర్ 25 నుంచి సోనీ లివ్‌లో ప్రసారంకానుంది. వసంత్ కుమార్ సంగీతం అందించారు. గతంలో ఈ సిరీస్ నుంచి వచ్చిన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. తాజాగా ట్రైలర్ విడుదల చేశారు. 'మీట్ క్యూట్' అంటే ఏంటో వివరిస్తూ ఒక్కో పాత్రను పరిచయం చేశారు. 'నీకు మీట్ క్యూట్ అంటే తెలుసా.. అనుకోకుండా ఇద్దరు పరిచయం లేని వ్యక్తులు మొదటిసారి కలిసినప్పుడు వాళ్ల మధ్య వచ్చే అందమైన పరిస్థితులు.. మాటలు.. ఆ జ్ఞాపకాలు జీవితాంతం గుర్తుండిపోతాయి' అంటూ నాని వాయిస్ ఓవర్‌తో ఈ ట్రైలర్ ప్రారంభమైంది.

వ్యక్తిగత సమాచారానికి భద్రత

ఉల్లంఘిస్తే రూ.500 కోట్లు జరిమానా • వ్యక్తిగత గోప్యత బిల్లు ముసాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వ్యక్తిగత సమాచారానికి భద్రత కల్పించేందుకు ముసాయిదా బిల్లును కేంద్ర ప్రభుత్వం రూపొందించింది. గత బిల్లును ఉపసంహరించుకున్న మూడు నెలల తరువాత కొత్త డిజిటల్ వ్యక్తిగత డేటా రక్షణ బిల్లు ముసాయిదాను శుక్రవారం విడుదల చేసింది. డిసెంబర్ 17 వరకూ ప్రజల అభిప్రాయాలు తీసుకుని, వచ్చే పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ప్రవేశపెట్టనున్నారు. డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ బిల్లు-2022 కింద ప్రతిపాదించిన నిబంధనలను ఉల్లంఘిస్తే జరిమానా రూ.500 కోట్ల వరకు పెంచింది. డేటా ప్రొటెక్షన్ బోర్డ్ ఆఫ్ ఇండియాను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. ఈ నిబంధనలను ఓ వ్యక్తి ఉల్లంఘించినట్లు దర్యాప్తు అనంతరం ఈ బోర్డు నిర్ధారణకు వస్తే, ఆ వ్యక్తి తన వాదనలను వినిపించేందుకు తగిన అవకాశాన్ని కల్పించాలని, ఆ వాదనలను విన్న తర్వాత ఈ బిల్లులోని ఒకటో షెడ్యూలులో నిర్దేశించిన విధంగా జరిమానాను విధించవచ్చునని పేర్కొంది. డేటా ఫిడుసియరీ, డేటా ప్రాసెసర్ తన నియంత్రణలో ఉన్న, తన స్వాధీనంలో ఉన్న పర్సనల్ డేటాను పరిరక్షించడంలో విఫలమైతే రూ.250 కోట్ల వరకు జరిమానా విధించవచ్చునని ఈ బిల్లు ప్రతిపాదించింది.

హెటిరో సిబిఐ విచారణ ఎదుర్కోవాల్సిందే : సుప్రీం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జడ్చర్ల సెజ్ భూకేటాయింపుల కేసులో హెటిరో సంస్థ సిబిఐ విచారణ ఎదుర్కోవాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సిబిఐ కేసు క్వాష్ చేయబోమంటూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ హెటిరో సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ కెఎం జోసెఫ్, జస్టిస్ హృషికేష్ రాయ్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది.

విద్యుదాఘాతంతో రైతు మృతి



ప్రజాశక్తి - వెదురు కుప్పం (చిత్తూరు జిల్లా)

విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన ఘటన చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం ఎగువపల్లాలు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పల్లాలు గ్రామానికి చెందిన మాజీ సైనికుడు, ప్రస్తుత రైతు బండి హిమాచలపతిరెడ్డి (55) కి మూడు ఎకరాల పొలం ఉంది. వేరుశనగ పంట వేసేందుకు సమీపంలో ఉన్న కోళ్లఫారాల షెడ్డు నుంచి ట్రాక్టర్‌తో ఎరువును తోలుకుని వచ్చి పొలంలో దింపేటపుడు ట్రాలీ లిఫ్ట్ లేపాడు. కొంత ఎరువు ట్రాక్టర్‌లో నిలిచిపోవడంతో ఎరువును కిందకు తోసేందుకు ట్రాలీ పైకి ఎక్కాడు. పైనే ఉన్న 11 కెవి వైరు తగిలి అక్కడికక్కడే ఆయన మృతిచెందాడు. హిమాచలపతిరెడ్డికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు.

వ్యర్థాల నిర్వహణ పట్ల ఎన్‌జిటి సంతృప్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

జాతీయ హరిత ట్రిబ్యునల్(ఎన్‌జిటి) మార్గదర్శకాలకు అనుగుణంగా ఘన, ద్రవ , వ్యర్థాలు, మురుగు నీటి నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యల పట్ల ఎన్‌జిటి సంతృప్తి వ్యక్తం చేసింది. ఎన్‌జిటి మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యర్థాల నిర్వహణపై సరైన చర్యలు తీసుకోని కారణంగా తెలంగాణ, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, రాజస్థాన్, కర్నాటక రాష్ట్రాలకు జస్టిస్ ఆదర్శ్‌కుమార్ గోయల్ నేతృత్వంలోని కమిటీ పెనాల్టీ విధించింది. ఈ మేరకు సమాచార పౌర సంబంధాలశాఖ కమిషనరు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి గతంలో ఎన్‌జిటి నోటీసులు జారీ చేసినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ఘన, ద్రవ వ్యర్థాలు, మురుగునీటి నిర్వహణపై తీసుకుంటున్న చర్యలను పరిశీలించిన కమిషన్ సంతృప్తి వ్యక్తం చేసి ట్రిబ్యునల్ నిర్ణీత కాల వ్యవధిలోగా పనులు పూర్తి చేయాలని ఆదేశిస్తూ నోటీసులను ఉపసంహరించుకుంది.

ఎన్‌సిపి అధ్యక్ష పదవికి ఫరూక్ అబ్దుల్లా రాజీనామా

శ్రీనగర్ : జమ్ముకాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, ఎంపీ ఫరూక్ అబ్దుల్లా నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అధ్యక్ష పదవి నుంచి తప్పుకుంటున్నట్లు శుక్రవారం ప్రకటించారు. కొత్త తరం బాధ్యతలు స్వీకరించాల్సిన సమయం ఆసన్నమైందని, ఇకపై పార్టీ అధ్యక్ష పదవికి పోటీచేయనని పేర్కొన్నారు. డిసెంబర్ 5వ తేదీన నేషనల్ పార్టీ అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయని, పార్టీలో ఎవరైనా అధ్యక్ష పదవి కోసం పోటీ పడవచ్చని, ఇది ప్రజాస్వామ్య విధానమని అబ్దుల్లా పేర్కొన్నారు.


ఎలన్ మస్క్‌పై ఉద్యోగుల తిరుగుబాటు..!

• ఆఫీసులు మూత



శాన్‌ఫ్రాన్సిస్కో : ట్విట్టర్ ఉద్యోగులు అధిక పనిగంటలు, కష్టపడి పని చేయాలన్న ఆ సంస్థ చీఫ్ ఎలన్ మస్క్‌పై సిబ్బంది తిరుగుబావుట ఎగరవేశారు. మస్క్ నిర్ణయాన్ని చాలా మంది ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారని రిపోర్టులు వస్తున్నాయి. "నిబంధనలకు లోబడి పని చేస్తారా.. వైదొలుగుతారా..?" అని మస్క్ జారీ చేసిన అల్టిమేటంపై వందలాది మంది ట్విట్టర్ ఉద్యోగులు స్వచ్ఛందంగా మూకుమ్మడి రాజీనామాలకు సిద్ధం అయ్యారని అంతర్జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. చాలా మంది ఉద్యోగులు తెగతెంపులు చేసుకోవాలని నిర్ణయించుకు న్నారు. దీంతో కంపెనీ తన కార్యాలయాన్ని తాత్కాలికంగా సోమవారం వరకు మూసివేసింది. ఈ విషయమై ఉద్యోగులకు సందేశాలు కూడా పంపారని సమాచారం. కంపెనీని వీడుతున్న వారిలో కీలక వ్యక్తులు ఉన్నట్లు తెలుస్తోంది. అసలు ట్విటర్ పనితీరు ఎలా ఉంటుందనే కీలక సమాచారం తెలిసిన వ్యక్తులు, బందాలు సైతం కంపెనీని వీడడానికి సిద్ధమైనట్లు సమాచారం. మస్క్ కీలక బృందాలతో జరిపిన భేటీలో అనేక మంది మధ్యలోనే వెళ్లిపోయారని తెలుస్తోంది. నిజానికి బుధవారం నాటి అల్టిమేటం వల్ల ఈ స్థాయిలో ఉద్యోగులు కంపెనీని వీడతారని మస్క్ అంచనా వేయలేదని బ్లూమ్‌బర్గ్ ఓ రిపోర్టులో పేర్కొంది. కాగా.. సామూహిక నిష్క్రమణల పట్ల తానేం అంతగా ఆందోళన చెందడం లేదని మస్క్ ఓ ట్వీట్‌లో తెలిపారు.

చరిత్ర సృష్టించిన మనికా



ఆసియా టేబుల్ టెన్నిస్ మహిళల సింగిల్స్ సెమీస్‌కు

బ్యాంకాక్: భారత మహిళల టేబుల్ టెన్నిస్ క్రీడాకారిణి మనికా బత్రా చరిత్ర సృష్టించింది. బ్యాంకాక్‌లో జరుగుతున్న ఆసియాకప్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ మహిళల సింగిల్స్ సెమీఫైనల్లోకి ప్రవేశించి మనికా ఈ అరుదైన ఘనత సాధించింది. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో మనికా 6-11, 11-6, 11-5, 11-7, 8-11, 9-11, 11-9(4-3) గేమ్‌ల తేడాతో చైనాకు చెందిన చెన్-జు-యుపై సంచలన విజయం సాధించింది. దీంతో ఈ టోర్నీ సెమీఫైనల్స్‌కు చేరిన తొలి భారత మహిళా క్రీడాకారిణిగా మనికా గుర్తింపు పొందింది. ప్రపంచ మహిళల టిటి ర్యాంకింగ్స్‌లో మనిక 44వ స్థానంలో ఉండగా.. చెన్ 23వ ర్యాంక్‌లో కొనసాగుతోంది. ఇక గురువారం జరిగిన ప్రి క్వార్టర్స్‌లో మనిక ప్రపంచ 7వ ర్యాంకర్ కింగ్‌టన్‌పై 8-11, 11-9, 11-6, 11-6, 9-11, 8-11, 11-9పాయింట్లతో గెలిచి క్వార్టర్స్‌కు చేరింది.


హైదరాబాద్‌లోనూ తెలుగు టైటాన్స్‌కు ఓటమే!

ప్రొ కబడ్డీ సీజన్-9

హైదరాబాద్: గచ్చిబౌలి వేదికగా జరుగుతున్న ప్రొ కబడ్డీ సీజన్-9లో తెలుగు టైటాన్స్ ఓటమిపాలైంది. ప్రథమార్థంలో రాణించినా.. రెండో అర్ధభాగంలో టైటాన్స్ చేతులెత్తేసింది. నిర్ణీత సమయం ముగిసే సమయానికి టైటాన్స్ 28-36పాయింట్ల తేడాతో బెంగాల్ వారియర్స్ చేతిలో ఓడింది. రైడ్స్‌లో రాణించినా.. ట్యాకిల్స్‌లో సత్తా చాటలేకపోయింది. నాలుగుసార్లు ఆలౌట్ కావడంతో టైటాన్స్ ఓటమికా కారణమైంది. అంతకుముందు జరిగిన తొలి మ్యాచ్‌లో పుణేరి పల్టన్స్ 41-28పాయింట్ల తేడాతో హర్యానా స్టీలర్స్‌ను ఓడించింది. మ్యాచ్ ప్రారంభమైనప్పటినుంచి పుణేరి పల్టన్స్ హర్యానా స్టీలర్స్‌పై పైచేయి సాధించింది. పుణేరి జట్టు రైడ్స్ ద్వారా 23పాయింట్లు సాధిస్తే.. ట్యాకిల్స్ రూపంలో 14పాయింట్లు సాధించడం విశేషం. ఇక హర్యానా జట్టు రైడ్‌ల ద్వారా 20పాయింట్లు సాధించినా.. ట్యాకిల్స్‌లో నిరాశపరిచి 7పాయింట్లు సాధించగల్గింది. పుణేరిజట్లు 4సార్లు హర్యానా స్టీలర్స్ జట్టును ఆలౌట్ చేసింది.

సీనియర్ సెలెక్టర్ల కమిటీపై వేటు

ముంబయి: చేతనశర్మ నేతృత్వంలోని సీనియర్ సెలెక్షన్ కమిటీపై భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు (బిసిసిఐ) వేటు వేసింది. ఇటీవల జరిగిన టి20 ప్రపంచకప్ సెమీస్‌లో ఓటమి నేపథ్యంలో బిసిసిఐ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. బిసిసిఐ శుక్రవారం ఓ ప్రకటనలో సీనియర్ సెలెక్షన్ కమిటీ సభ్యులందరి నియామాలకు సంబంధించి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రకటించింది. దరఖాస్తు చేసుకొనే ఆటగాడు కనీసం 7టెస్టులు గానీ, లేదా 30ఫస్ట్‌క్లాస్ (10వన్డేలు, 20 ఫస్ట్‌క్లాస్) మ్యాచ్‌లు ఆడాలని పేర్కొంది. క్రికెట్‌నుంచి వైదొలిగి ఐదేళ్ల కాలం పూర్తి చేసుకోవాలని, దరఖాస్తులు పంపేందుకు ఈనెల 28 ఆఖరు తేదీ అని తెలిపింది.



భారత్-న్యూజిలాండ్ జట్ల మధ్య వెల్లింగ్టన్ వేదికగా శుక్రవారం జరగాల్సిన తొలి టి20 వర్షం కారణంగా రద్దు అయ్యింది. వెల్లింగ్టన్‌లో ఉదయం నుంచి ఎడతెరపిలేకుండా వర్షం కురవడంతో కనీసం టాస్ వేసే అవకాశం దక్కలేదు. దీంతో తొలి టి20ని రద్దు చేస్తున్నట్లు అంపైర్లు ప్రకటించారు. రెండో టీ20 ఆదివారం మొంట్‌ముఘనాయ్ వేదికగా జరగనుంది.

జోడోయాత్రలో తుషార్‌గాంధీ



ముంబయి : కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ నేతృత్వంలో నిర్వహిస్తున్న భారత్ జోడోయాత్రలో మహాత్మాగాంధీ మునిమనవడు తుషార్‌గాంధీ పాల్గొన్నా రు. దీంతో భారత్ జోడో యాత్రలో చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైందని కాంగ్రెస్ ట్వీట్ చేసింది. పాదయాత్ర శుక్రవారం ఉదయం ఆరుగంటలకు అకోలా జిల్లా బాలాపూర్ నుంచి ప్రారంభమైందని, కొన్ని గంటల తర్వాత షెగావ్‌కు చేరుకుందని, రచయిత, మహాత్మాగాంధీ ముని మనవడు తుషార్ గాంధీ రాహుల్‌గాంధీతో కలిసి నడిచారని పేర్కొంది. జవహర్‌లాల్ నెహ్రూ, మహాత్మాగాంధీల ముని మనవళ్లైన రాహుల్ గాంధీ, తుషార్ గాంధీ వారి వారసత్వపు వాహకాలుగా పేర్కొంది.

జోడో యాత్రకు బాంబు బెదిరింపు

భారత్ జోడో యాత్రకు శుక్రవారం బాంబు బెదిరింపు వచ్చింది. ఈ యాత్ర మరో రెండు రోజుల్లో మధ్యప్రదేశ్‌లో ప్రవేశించనుండగా, ఆ రాష్ట్రంలో ఈ బెదిరింపు లేఖ దొరకడం కలకలం సృష్టిస్తోంది. జోడో యాత్రికులు ఇండోర్‌లోని ఖల్సా స్టేడియంలో బస చేస్తే నగరంలో బాంబు పేలుళ్లు చేపడతామని గుర్తు తెలియని వ్యక్తులు బెదిరించారు.

బీరు అమ్మకాలపై ఫిఫా నిషేధం

దోహా: ఫిఫా ప్రపంచకప్-2022 మెగా టోర్నీ ఆదివారంనుంచి ప్రారంభం కానుంది. ప్రపంచకప్ పోటీలు జరిగే ఎనిమిది స్టేడియాల్లో బీరు అమ్మకాలపై ఫిఫా నిషేధం విధిస్తున్నట్లు ఓ ప్రకటన తెలిపింది. ఈ విషయమై ఖతర్, ఫిఫా మధ్య కొన్ని నెలలు చర్చలు జరుగుతున్నాయి. మ్యాచ్‌లు జరిగే స్టేడియాల్లో బీరు అమ్మకాలపై నిషేధం విధించాలని ఖతర్ అధికారులు, ఫిఫా మీద ఒత్తిడి తెచ్చారు. దాంతో, స్టేడియాల్లో బీరు అమ్మకాలపై నిషేధం విధిస్తూ ఫిఫా తాజాగా నిర్ణయం తీసుకుంది. ఫిఫా ఇప్పటికే బడ్‌వైజర్ బీరు కంపెనీతో 75మిలియన్ డాలర్ల స్పాన్సర్‌షిప్ ఒప్పందం చేసుకుంది. ఫెస్టివల్, లైసెన్స్ ఉన్న కేంద్రాల్లో బీర్ల అమ్మకాలకు ఫిఫా అనుమతిచ్చింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68